ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 17 నవంబర్ 2025

## ప్రతి ఒక్కరికి సురక్షిత త్రాగునీరు అందాలి

**పులివెందుల నవంబర్ 16 ప్రభాత వార్త :**



ప్రజలకు సురక్షిత త్రాగునీరు ప్రతి ఒక్కరికి అందించడమే ధ్యేయమని పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి కడప జిల్లా మాజీ అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డిలో అన్నారు. ఆదివారం పులివెందుల మున్సిపాలిటీ లోని 20మరియు22 వార్డ్ ప్రజల త్రాగునీటి దాహార్తి కోసం హజ్ కమిటీ సభ్యులు మహబూబ్ బాషా ఏర్పాటు చేసిన కొత్త వాటర్ ట్యాంక్ వాహనాలను కడప జిల్లా టీడిపి అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి (వాసు) మరియు పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బిటెక్ రవి శేషారెడ్డి స్కూల్ నందు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు ప్రతి ఒక్కరికి సురక్షిత త్రాగునీరును అందించడం జరుగుతుందని అందుకు ప్రభుత్వం నుంచి తగు సహాయ సహకారాలు అందుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

30న ప్రొద్దుటూరులో ఖేలో ఇండియా అస్మిత లీగ్ జిల్లాస్థాయి

## అండర్ 14, 16 బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు

**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 16, ప్రభాతవార్త :**

అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ కడప జిల్లా ఆధ్వర్యంలో నవంబర్ నెల 30 ఆదివారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హై స్కూల్ ఆట స్థలంలో ఖేలో ఇండియా అస్మిత లీగ్ జిల్లాస్థాయి అండర్ 14 16 బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి వై అహ్మర్ భాషా, ప్రెసిడెంట్ బసిరెడ్డి వీర కళ్యాణ్ తెలిపారు. అండర్ 14 విభాగంలో బాలికలకు (21/12/2011 20/12/2013) మధ్య తేదీలలో పుట్టిన వారికి ట్రియాథ్లోన్ (ఏ) 60 మీ, లాంగ్ జంప్, హై జంప్, ట్రియాథ్లోన్ (బి) 60 మీ, లాంగ్ జంప్, బ్యాక్ త్రో, ట్రియాథ్లోన్ (సి) 60 మీ, లాంగ్ జంప్, 600 మీ, కిడ్స్ జావెలిన్ అండర్ 16 విభాగంలో బాలికలకు (21/12/2009 20/12/2011) మధ్య తేదీలలో పుట్టిన వారికి 60 మీ, 600 మీ, లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో క్రీడలలో పందెములు నిర్వహించబడునని వివరించారు. ఇందులో కడప జిల్లా వారు ఎవరైనా పాల్గొనవచ్చని, ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ కేంద్రాలు, జాతీయ అథ్లెటిక్ శిక్షణ శిబిరాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఇందులో 12 సంవత్సరములు వయసు నిండిన వారు మాత్రమే పాల్గొనాలని, వయస్సు ధ్రువీకరణ కొరకై ఆధార్ కార్డు/బర్త్ సర్టిఫికేట్ తమ వెంట తెచ్చి నిర్వాహకులకు సమర్పించవలసి ఉంటుందని సూచించారు. క్రీడాకారులు ఖేలో ఇండియా అస్మిత వెబ్సైట్ నందు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది https://sfw.kheloindia.gov.in విజేతలకు పథకాలు ప్రశంసా పత్రాలు బహూకరించబడతాయని తెలిపారు. మరిన్ని వివరాలకై వై అహ్మర్ భాష, కార్యదర్శి, 9949686586, 8019880995 సంప్రదించాలని సూచించారు.

# 130 కోట్లతో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్

**గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే పక్కనే భూములు... 150 ఎకరాలు కేటాయిస్తూ జీవో జారీ... అన్నమయ్య జిల్లాలో పరిశ్రమకు ప్రభుత్వం శ్రీకారం**



కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్



రిలయన్స్‌కు గుండ్లూరు గ్రామ పొలంలో కేటాయించిన భూములు

**రాజంపేట, నవంబర్16 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లాలో మొదటి పరిశ్రమ రాబోతుంది. అది కూడా ప్రముఖ కార్పొరేట్ సంస్థ రిలయన్స్ ఆధ్వర్యంలో రానుంది. జిల్లా పోయింది, మెడికల్ కాలేజీ పోయింది, పరిశ్రమలు లేవు అన్న ప్రజలకు ఊరటగా రాష్ట్ర ప్రభుత్వం రాజంపేట మండలంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు రాజంపేట మండలంలో 150 ఎకరాల భూమి కేటాయిస్తూ జీవో జారీ చేసింది. ఈ మేరకు న్యూ రెన్యువల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు భూములు కేటాయిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రెటరీ జయలక్ష్మి జీవో నెంబర్ 412 జారీ చేశారు. రాజంపేట మండలంలోని గుండ్లూరు రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 805లో 100 ఎకరాలు, పులపత్తూరు గ్రామ పొలము సర్వేనెంబర్ 8762లో 50 ఎకరాల భూములు కేటాయించారు. ఎకరాకు 15,000 వేల రూపాయలు చొప్పున చెల్లించేలా 30 సంవత్సరాలకు లీజును ఖరారు చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఐదు శాతం ధర పెంచేలా నిర్ణయించారు. ఒకవేళ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిశ్రమ ఏర్పాటు చేయకపోతే భూముల లీజు రద్దు చేసే అధికారం కలెక్టర్కు ఉంటుంది. ఈ మేరకు జీవోలో స్పష్టం చేశారు. అధికారిక సమాచారం ప్రకారం రిలయన్స్ సంస్థ మొదటి విడత 130 కోట్లు వెచ్చించి పరిశ్రమ ఏర్పాటు చేయనుంది. గడ్డి చెత్త నుంచి బయోగ్యాస్ ను ఉత్పత్తి చేస్తారు. మేరకు రాజంపేట మండలంలోని గుండ్లూరు పులపత్తూరు హస్తవరం ప్రాంతాల్లో గడ్డి పెంచే రైతులకు సంస్థ ప్రోత్సాహం కూడా ఇచ్చే అవకాశం ఉంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం రిలయన్స్ సంస్థకు కేటాయించిన భూములు కడప రేణిగుంట గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవేకి పక్కనే ఉండడం విశేషం. కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోపే చెయ్యేరు నది కూడా ప్రవహిస్తుంది. మరో వైపు పులపుత్తూరు గ్రామ పొలంలో కూడా 50 ఎకరాలు భూమి కేటాయించినందుకు కారణాలు తెలియడం లేదు. అయితే ఇక్కడ కూడా సంస్థ భూములు ఉపయోగించుకునేలా కేటాయించినట్లు తెలుస్తోంది. ఎంతో విలువైన ఈ భూములు వైసిపి హయాంలో జిల్లా వస్తుందని ఉద్దేశంతో అధికారులు అప్పుడే పక్కా సర్వే చేశారు. మొదట మెడికల్ కాలేజ్‌కి అనువుగా ఉంటుందని భావించారు. మెడికల్ కాలేజ్ మదనపల్లికి వెళ్లిపోయింది. ఆ తర్వాత జిల్లా సెంట్రల్ జైలు కోసం ప్రతిపాదించారు. అనంతరం వైసిపి హాయంలో చివరలో మధ్యతరగతి ప్రజల కోసం ఎంఐజి లేఔట్ ఏర్పాటు చేయాలని ఈ భూమిని సర్వే చేసి స్కెచ్ కూడా సిద్ధం చేశారు. అంతేకాకుండా లేఅవుట్ నిర్మాణం కోసం టెండర్లు కూడా పిలిచారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ఆ భూమి అలాగే ఉండిపోయాయి. ఎట్టకేలకు ఓ పరిశ్రమ ఏర్పాటుకు ఈ భూములు నేడు అనువుగా మారాయి. ఇదిలా ఉండగా రాజంపేట మండలంలో ప్రముఖ కార్పొరేట్ సంస్థ రిలయన్స్ కంప్రెసెడ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వెనుక సీఎం ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చారని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు అన్నారు. సెప్టెంబర్ 2న రాజంపేట పర్యటనకు వచ్చిన సందర్భంగా రాజంపేట ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీఎంను కోరామన్నారు. అందుకు సీఎం స్పందించి రాజంపేట మండలంలో రిలయన్స్ ద్వారా కంప్రెస్డ్ బయో గ్లాస్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. రాజంపేట మండలంలో తొలి పరిశ్రమ ఏర్పాటు కావడం పట్ల జగన్మోహన్రాజు హర్షం వ్యక్తం చేశారు. సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు



**కడప క్రైం, నవంబరు 16, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పాఠశాలల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఆదివారం మహిళా భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు బాలికల రక్షణ, సమాజంలో మహిళల భద్రత, మరియు పోక్సో (పీఓసీఎస్ఓ) చట్టం ప్రాముఖ్యత గురించి వివరించారు. బాలికలు ఎదుర్కొంటున్న మానసిక శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. సైబర్, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్లైన్ భద్రత తదితర వాటిపై అవగాహన కల్పించారు. చిన్న వయసులో జరిగే బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై వారికి ఉదాహరణలతో వివరించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. డయల్ 100/112(అత్యవసర సహాయం), చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ), గృహహింస 181, మహిళల వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్‌ఫ్రీ 1930, సైబర్ మిత్ర నంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



**కడప క్రైం, నవంబరు 16, ప్రభాతవార్త:**

గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి సేవనం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వన్‌టౌన్, టుటౌన్, తాలూకా పీఎస్ పరిదిలో ఆయా ప్రాంతాలను జల్లెడ పట్టారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. ఆదివారం నగరంలోని బుగ్గవంక పరివాహక ప్రాంతం, గుర్రాలగడ్డ, పాత బస్టాండ్, నభీకోట, తారక రామనగర్ పరిసరాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానాస్పదంగా సంచరించే వారిని గుర్తించే చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నిరంతరం కడప నగరంలోని అనుమానిత ప్రాంతాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పట్టడం జరుగుతుందని కడప డీఎస్పీ తెలిపారు.

## కడప ఆర్టీసీ బస్టాండులో విస్తృత తనిఖీలు

**కడప క్రైం, నవంబరు 16, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా కడప ఆర్టీసీ బస్టాండులో ఆదివారం రాత్రి చిన్నచౌకు పోలీసులు బస్టాండులోని అనుమానితుల ప్రయాణికుల బ్యాగులు, బస్టాండు పరిసరాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే డయల్ 112కు కానీ, స్థానిక పోలీసులకు కానీ సమాచారం అందించాలని ప్రజలకు చిన్నచౌకు సీఐ ఓబులేసు సూచించారు. తనిఖీల్లో ఎస్సై రవికుమార్, చిన్నచౌకు పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం



పడిపూజకు హాజరైన అయ్యప్ప భక్తులు



విద్యుత్ దీపాల అలంకరణలో అయ్యప్ప ఆలయం



**రాజంపేట, నవంబర్16 ప్రభాతవార్త**

రాజంపేటలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరం శబరిమలలో మండల పూజ మహోత్సవం ప్రారంభమయ్యే రోజు రాత్రి రాజంపేటలో కూడా పవిత్రపదునెట్టాంబడికి పడి పూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఆదివారం రాత్రి రాజంపేట పట్టణంలోని జాతీయ రహదారిలో మణికంఠ నగర్ లో వెలసిన అయ్యప్ప ఆలయంలో పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పవిత్ర 18 సోపానాలను శుభ్రం చేసి, స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. ప్రతి మెట్టుపై పూలు, పళ్ళు, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గురుస్వామి కొండా సత్యనారాయణ, ఆలయ పురోహితులు రాఘవేంద్ర శర్మ, పురోహితులు కార్తీక్ స్వామి పవిత్ర పదునెట్టంబడికి పూజలు చేశారు. ప్రతి మెట్టుకు శక్తి పూజలు చేశారు. అనంతరం పడి పై కర్పూర హారతిని వెలిగించి అయ్యప్ప నామస్మరణ మధ్య పడిపాట పాడారు. పడిపూజతో అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. అంతకుముందు తెల్లవారుజామునే అయ్యప్ప మూలవిరాట్కు ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు చేశారు. అలాగే రాత్రి అయ్యప్ప స్వాములు భక్తితో భజనలు చేశారు. పడిపూజ అనంతరం రాత్రి స్వాములకు తుంగ రామలింగారెడ్డి కుటుంబ సభ్యులు బిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పాల ప్రకాష్, శాశ్వత అన్నదాన తాత కృష్ణయ్య నాయుడు,డైరెక్టర్లు దాము ఆచారి, వెంకటేశ్వర్ రెడ్డి, నాగరాజు, రమేష్ బాబు, చంద్రమోళి గురుస్వామి, సుధాకర్, ఆదినారాయణతో పాటు గురుస్వాములు వరదయ్య గారి పల్లె సుబ్బరాయుడు, ఇండ్లూరు వెంకటరెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పకు అభిషేకం చేస్తున్న దృశ్యం



పడిపూజ దృశ్యం

## ఘనంగా అంబలపూజ మహోత్సవం

**రామసముద్రం, నవంబర్ 16 ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయితీ మట్లవారిపల్లె గ్రామంలో గట్టు శివాలయంలో ఆదివారం అంబలపూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి అయ్యప్ప స్వామి ఆలయంలో విద్యుత్ దీపాలంకరణ, పచ్చని తోరణాలతో ముస్తాబు చేశారు, 41రోజు మాలదారణలో అయ్యప్ప స్వాములకు మొదటి సంవత్సరం మాలవేసిన స్వాములకు కన్యపూజలు, రెండవ సంవత్సరం మాలవేసిన అయ్యప్పలకు కత్తిపూజ మూడవ సారి వేసిన స్వాములకు గంటపూజ,గద పూజ వేదమంత్రాలతో గురుస్వాములు అయ్యప్ప, శివ రెడ్డెప్ప,ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి పన్నీరు, గంధం,పచ్చకర్పూరం వీభూదిలతో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని శుభ్రం చేసి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రం నిర్వహించారు. ఈ పూజలో అయ్యప్ప భజనలు భక్తులను అకట్టుకొన్నాయి. ఈ అంబళం పూజ కార్యక్రమంలో గట్టు అయ్యప్ప స్వామి బృందం స్వాములు, భక్తులు తదితరులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## సీఎం బ్రాండ్ ఇమేజ్‌తోనే విశాఖ సమ్మిట్ సూపర్ సక్సెస్

**టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ జగన్ మోహన్ రాజు**

**రాజంపేట, నవంబర్16 ప్రభాతవార్త**

విశాఖపట్నంలో రెండు రోజులపాటు జరిగిన సిఐఐ సమ్మిట్ ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మార్చనుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్రాండ్ ఇమేజ్ అంతర్జాతీయ స్థాయిలో ఏపాటిదో రుజువైందని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రక వేదికగా విశాఖ సీఎం సమ్మిట్ మారిందన్నారు.ఏపీని పెట్టుబడుల హబ్ గా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఐటి అండ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమిష్టి కృషి ఫలించింది అన్నారు. కూటమి ప్రభుత్వంలో రాయలసీమ, కోస్తాంధ్ర ,ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాలకు సమన్యాయం జరుగుతుందన్నారు.జగన్ రెడ్డి ఐదేళ్ల విధ్వంసకర విధానంలో భయపడి రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన పలు కంపెనీలు కూటమి ప్రభుత్వంలో అంచనాలకు మించి ఏపీ వైపు పలు మరలా రావడం తండ్రి, కొడుకుల కృషి అన్నారు.మొత్తం 613 ఒప్పందాల ద్వారా13.25 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా యువతకు లక్షల ఉద్యోగాల అవకాశాలు లభించనున్నాయన్నారు. రాజంపేట ప్రాంతం పారిశ్రామిక అవసరాలకు అనుకూలమన్నారు.రాజంపేట నియోజకవర్గాన్ని పారిశ్రామిక అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. రాజంపేట నియోజకవర్గం లో అన్ని వసతులు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఆ దిశగా ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు.ఈ కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, రాజంపేట పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు రూరల్ అధ్యక్షుడు మేడికొండ రవి నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, రాజంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, రాజంపేట ఎస్సీ నాయకులు మంద శ్రీను పాల్గొన్నారు.



ఝరికోన ప్రాజెక్టు సాగునీటి కాలువలు నిర్మాణానికి

# నిధులు మంజూరు చేయాలి

**సుండుపల్లె,నవంబర్16, ప్రభాతవార్త:**



అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం,కలకడ మండలాల సరిహద్దులో బహుదా దానిపైన ఝరికోన ప్రాజెక్టు(బహుదా జలాశయం) నుంచి సుండుపల్లె మండలంలో నిర్దేశించిన ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు కాలువలు నిర్మాణానికి నిధులు ప్రభుత్వం వెంటనే మంజూరు చేసి, పనులు పూర్తి చేయాలని సుండుపల్లి బహుదా జల సంరక్షణ, మరియు జల సాధన సమితి కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఆదివారం ఒక పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.2005 సంవత్సరంలో 46.63 కోట్ల రూపాయల అంచనాలతో పరిపాలన అనుమతులు నిధులు మంజూరు చేయడం జరిగిందని,2006 సంవత్సరంలో ప్రాజెక్టు కట్టి,మొరవ పనులు 2009 సంవత్సరం నాటికి పూర్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. సాగునీటి కాలువలు పనులు నిధులు మంజూరు చేయకుండా పోవడంతో నేటికీ మొదలెట్టకుండా రెండు దశాబ్దాలుగా రాజకీయ నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేక చోరవతో నిధులు కేటాయించి, పనులు పూర్తి చేసి ముగింపు పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిరుపయోగంగా ఉన్న ఝరికోన జలాలను బీడు భూముల్లో పారించి సద్వినియోగం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఝరికోన ప్రాజెక్టు తూము వెంటనే తయారు చేయాలని, అక్కడికి వెళ్ళడానికి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, అలాగే ఝరికోన ప్రాజెక్టు సామర్థ్యాన్ని 2 టియంసిల స్థాయికి పెంచి హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణ జలాలతో నింపాలని ఆయన కోరారు. ఆ ప్రాజెక్టు పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఇంజనీర్ ను నియమించాలని కోరారు.

## రైతులు రాయితీ ఉలవల కోసం రిజిస్టర్ చేసుకోండి

**రామసముద్రం నవంబర్16 ప్రభాతవార్త**

రామసముద్రం మండలానికి రాయితీపై ప్రభుత్వం 300క్వింటాళ్లు ఉలవలు కేటాయించడం జరిగిందని ఏ.ఓ జాఫర్ తెలిపారు. ఉలవలు కొరకు సంబంధిత రైతు సేవ కేంద్రంలో రిజిస్టర్ చేసుకొనవాలని సూచించారు. అలాగే జింక్ సల్ఫేట్, ఫాస్పరస్ బ్యాక్టీరియా, పొటాష్ రైతు సేవ కేంద్రం నందు అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు, సంబంధిత రైతు సేవ కేంద్రం నందు రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు.

## కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం లక్ష్మీనరసింహ స్వామి

**:ఈ నెల 18 మూల నక్షత్ర ప్రత్యేక పూజలు**

**బద్వేలు, నవంబర్ 16, ప్రభాతవార్త :**



నియోజకవర్గంలోని అట్లూరు మండలం కుంభగిరి క్రాస్ రోడ్డు వద్ద వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. ఈ నెల 18వ తేది మంగళవారం స్వామివారి జన్మదిన మూలా నక్షత్రం సందర్బంగా ఆలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు మరియు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్తీకమాసంలో వచ్చే ఈ మూలా నక్షత్ర ప్రత్యేక విశిష్టతను సంతరించుకున్న నేపథ్యంలో ఆలయంలో అధికంగా వచ్చే భక్తులు ఏలాంటి ఇబ్బందులు పడకుండా అందుకు తగిన అన్నిసౌకార్యలు, ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు. ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న రోజును పురస్కరించుకుని భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రతి భక్తుడు స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు ఆకాంక్షించారు.

## తొగటవీర క్షత్రియ భవన్ ఏర్పాటుకు కృషి చేస్తాం..



కడప కార్పొరేషన్ నవంబర్ 16 ప్రభాతవార్త:

తొగటవీర క్షత్రియ భవన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మంజూరు చేసేందుకు కృషి చేస్తానని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి రెడ్డి హామీ ఇచ్చారు. తొగటవీర క్షత్రియ కార్పొరేషన్ ను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కనుమలోపల్లిలోని 108 శివలింగాల మహాలింగేశ్వర స్వామి సన్నిధిలో కార్తీకమాస వన భోజనం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్.మాధవి రెడ్డి నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. మహిళలకు పిల్లలకు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు, సంఘం నాయకులు ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, టేకూరు సుదర్శన్, పల్లా మురళీ కృష్ణయ్య, చౌడం సూరిబాబు, బొమ్మిశెట్టి చంద్రశేఖర్, ఉప్పు శంకర్, సంగినాథం ఆంజనేయులు, గోవిందు నాగరాజు, పల్లా బాలచౌడన్న, సుంకర రామచంద్రుడు, సిఆర్ఐ సునీల్ జయంత్ పాల్గొన్నారు.

## మానవతా సంస్థ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం

సుండుపల్లె, నవంబర్ 16, ప్రభాతవార్త :



మండల ప్రాథమిక పాఠశాల సుండుపల్లిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం లో దాదాపు 20 మంది మన సభ్యులు మిత్రులు రక్తదానం చేయడం జరిగిందని, రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి సంస్థ ఆధ్వర్యంలో జ్యూస్ మరియు ఆపిల్ పళ్ళు బహుకరించడం జరిగిందని మానవతా సంస్థ చైర్మన్ గంగిరెడ్డి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు లక్ష్మయ్య నాయుడు,కార్యదర్శి అమృనాయక్,ఆర్థిక కార్యదర్శి నరసింహులు,సీనియర్ డైరెక్టర్ రవీంద్ర నాథరెడ్డి,కన్వీనర్ కృష్ణంరాజు ,కో చైర్మన్ నాగేశ్వరరావు, ఉమ్మడి కడప జిల్లా ఆర్థిక కార్యదర్శి హరికుమార్మం,కర్ నాయక్, ఇస్మాయిల్ ,అరిఫుల్లా ,మణికంఠ ,హేమంత్, విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు .రక్త దానం చేసిన ప్రతి ఒక్క మిత్రునికి పేరు పేరునా మానవతా అభినందనలు తెలిపారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ: ఇద్దరికీ స్వల్ప గాయాలు

పీలేరు, నవంబర్ 16 ప్రభాతవార్త:

పిలేరు మండలం సొరకాయలపేట కట్టపై మేడి కుర్తి సర్కిల్ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మిన్నంరెడ్డిగారి పల్లి నుంచి రోడ్డు దాటుతున్న టీవీఎస్ ఎక్సెల్ స్కూటర్‌ను, రాయచోటి నుంచి పీలేరు వైపు వస్తున్న పల్సర్ బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు వాహనదారులకు స్వల్ప గాయాలు కాగా స్థానికులు వెంటనే పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేవీపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## యుసిఎల్ మైన్స్ ద్వితీయ వార్షిక భద్రత వారోత్సవాలు

పులివెందుల, నవంబర్ 16, ప్రభాత వార్త :



నియోజవర్గంలోని వేముల మండలం మబ్బు చింతలపల్లి వద్ద ఉన్న యూ సి ఐ ల్ తుమ్మల పల్లె మైన్స్ లో ద్వితీయ వార్షిక భద్రతా వారోత్సవాలు ఆదివారం ఈ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు రీజన్ గనుల భద్రత పర్యవేక్షణ అధికారి డీ .కిషోర్ కుమార్ , యు సి ఎల్ డైరెక్టర్ టెక్నికల్ మనోజ్ కుమార్ ఎస్ఎంఎస్ ఐ ఎల్ డైరెక్టర్, కే,ఆర్ రావు మరియు యుసిఐఎల్ ఐఎస్ఓ హెడ్ డాక్టర్ కేకే రావు ,జనరల్ మేనేజర్ మిల్ సుమన్ సర్కార్ లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సేఫ్టీ పథాకం ఎగురవేసి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి గనుల లో పాటించవల సిన భద్రత నియమాలను వివరించి ఇక్కడ అమలు పరచాలని తెలియజేశా రు,భూగర్భ గని నుంచి బయటికి వచ్చే ఖనిజం కంటే సురక్షితంగా బయటికి వచ్చే కార్మికుడు ముఖ్యమని,వివిధ మోడల్స్, సేఫ్టీ డ్రామా,సేఫ్టీ సాంగ్స్,ఫస్ట్ ఎయిడ్ లలోను మరియు పని ప్రదేశాలని పరిశీలించి వివిధ రకాల విభాగాలలో విజేతలకు జ్ఞాపకిలనీ బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో మైన్స్ ఏజెంట్ కిషోర్ కుమార్ భగత్ ,మైన్స్ మేనేజర్ బాధవత్ శ్రీను,సేఫ్టీ ఆఫీసర్ మోహన్ రెడ్డి నిర్వహించారు. ఇలాంటి వార్షికోత్సవం ప్రతి ఇయర్ ఘనంగా నిర్వహిస్తా మని భద్రతే దేయం గా పనిచేస్తామని చెప్పారు, ఈ కార్యక్రమంలో పికె నాయక్,కోటేశ్వర రావు,విజయ్ కుమార్, గౌతం కొల్లూరు, వాసు దేవ రెడ్డి,ఎస్. ఎం.స్.జనరల్ మేనేజర్ జి . స్.రావు మరియు యుసిఐల్, ఎస్ఎంస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షురాలుగా కాకి గీతాంజలి

పీలేరు నవంబర్ 16 ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా మాల మహానాడు ఉపాధ్యక్షురాలుగా కలికిరి మండలం ఫతేగడ పంచాయతీ తెల్లగుట్లపల్లి హరిజనవాడకు చెందిన కాకి గీతాంజలిని జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈరోజు మదనపల్లిలో రాయలసీమ జిల్లాల మాల మహానాడు సభలో రాష్ట్ర అధ్యక్షులు యమల సుదర్శనం ఆదేశాల మేరకు మాల మహానాడు అధికార ప్రతినిధి హరి చౌరవతో కాకి గీతాంజలిని ఉపాధ్యక్షురాలుగా నియమించడం జరిగింది. ఈ నియమక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు సుదర్శనం రాష్ట్ర మాల మహానాడు అధికార ప్రతినిధి హరి చేతుల మీదుగా పత్రాన్ని అందించడం జరిగింది కాకి గీతాంజలి మాట్లాడుతూ నేను మాల మహానాడు సంఘానికి నా వంతు కృషి చేస్తానని సంఘ నాయకుల అడుగుజాడల్లో నడుచుకుంటానని చెప్పినారు ఈ కార్యక్రమంలో ఎస్టీ రమణ మాల మహానాడు మండల అధ్యక్షులు సతీష్ అర్జున విశ్వనాథ కుమార్ శీను సహదేవ రామకృష్ణ హరి చంద్ర పాల్గొన్నారు.

## ముక్తి రామలింగేశ్వర ఆలయంలో లక్ష బిల్వార్చన మహోత్సవం

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 16, ప్రభాతవార్త



స్థానిక రామేశ్వరం లోని శ్రీ రాజరాజేశ్వరీ దేవి సమేత శ్రీముక్తి రామలింగేశ్వర స్వామి కార్తీక మహోత్సవాలలో భాగంగా ఆదివారం లక్ష బిల్వార్చన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర స్వామికి ప్రీతికరమైన బిల్వ పత్రాలతో స్వామి వారిని పూజించారు. ఈ కార్యక్రమం అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించడంతో పాటు అన్నప్రసాద సేవను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు నిర్వహించారు.

## 1000 తులసి మొక్కలతో తులసివనం ఏర్పాటు

బద్వేలు ,నవంబర్ 16, ప్రభాతవార్త



పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఎంవిఐ శేఖర్ రావు ఆధ్వరంలో తులసివనం ఏర్పాటు చేశారు. తులసివనం దేవాలయంలో ఉండాలనే ఉద్దేశంతో ఆవరణంలో 1000 తులసి మొక్కలతో తులసి వనానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులసి మొక్క సర్వ శ్రేష్టధాయమని, హిందువులకు పవిత్ర మొక్క అయిన తులసి మొక్కలు నాటడం తనకెంతో సంతోషంగా ఉందని, అలాగే ఈ మొక్కలు పెరిగి పెద్దయిన తర్వాత ఈ తులసి ఆకులను వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు మాలగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరీ సాయి బార్ యజమాని బ్రహ్మాదేవుని ఎర్రం రెడ్డి, గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు అంకయ్య, సుబ్బరాయుడు, శంకరయ్య పాల్గొన్నారు.

## బలిజలు అందరూ సమిష్టిగా అభివృద్ధి కావాలి

పీలేరు నవంబర్ 16 ప్రభాతవార్త:



బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం

బలిజలందరూ గత చరిత్రను తెలుసుకొని అవగాహనతో సంబంధాలను మెరుగుపరచుకొని సమిష్టిగా ఎదగాలని బలిజ సంఘం పీలేరు నేతలు పేర్కొన్నారు. ఆదివారం పీలేరులోని కొత్తపేట వద్ద బలిజ సంఘం, పీలేరు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్రీస్తుశకం మూడవ శతాబ్దం నుండి ఆంధ్ర రాష్ట్రంను పరిపాలించిన చోళ రాజుల నుండి విజయనగర మధురై తంజావూరు నాయకరాజుల వరకు సాగిన బలిజ రాజుల పరిపాలనను చరిత్రను అవగాహన చేసుకుని పూర్వవైభవాన్ని పొందుటకు ప్రతి బలిజ ముందుకు రావాలని వారు బలిజలకు దిశా నిర్దేశం చేశారు . కార్తీకమాసం సందర్భంగా శివ కేశవుల కు ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించి కార్తీక దీపారాధన సాధించారు బలిజ కుల పెద్దలు బలిజ కుల బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బలిజ పెద్దలు గన్న .ప్రభాకర్ లక్ష్మీ కర, మోకాటి మల్లికార్జున గాజులు రవికుమార్ పివి రమణ డిష్ పురుషోత్తం తదితరులు ప్రసంగించి నిర్వాహకులను నిర్వహణ కమిటీని ప్రత్యేకంగా అభినందించారు పీలేరులోని జనప్రియ మెస్ వెంకటేష్ మంచి భోజనాలు అందించారని తెలిపారు.

## భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి..

సుండుపల్లె,నవంబర్ 16, ప్రభాతవార్త :

మహిమగల తల్లి అడిగిన వెంటనే భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం శ్రీ నాగారపమ్మ తల్లి పిల్లలు లేని ఆడవాళ్లకు బిడ్డలను ప్రసాదించే శక్తిగల మహిమగల అమ్మగా పేరుంది.దశాబ్దాల కాలంనాటి చరిత్ర కలిగిన నాగారపమ్మ తల్లి చరిత్ర చూస్తే మండల పరిధిలోని పెదినేని కాలువ పంచాయతీ బండకాడ ఈడిగ పల్లె గ్రామంలో బాహుదా నదీ పరీవాహక ప్రాంత సమీపంలో వెలసిన నాగారపమ్మ తల్లి మహిమలకు చుట్టుపక్కల జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తూ ఉంటారు. ఈ మహిమగల తల్లి భక్తుల పాలిట కొంగు బంగారమై పూజలందుకుంటుంది. ఆదివారం ఉదయం పూజారులు అమ్మవారిని ప్రత్యేక పూలు , పట్టు వస్త్రాలు మరియు బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు.ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులలో భాగంగా బోనాలతో ప్రదక్షిణలు చేసి అమ్మవారికి తలనీలాలు సమర్పించుకున్నారు.

## బిజెపి కురబలకోట మండల సంపర్క్ సమావేశం

కురబలకోట నవంబర్ 16 ప్రభాతవార్త



కురబలకోట మండలం అంగళ్ళులోని గోల్డెన్ వ్యాలీ క్యాంపస్‌లో ఈరోజు రాష్ట్ర సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యవర్గ సభ్యులు, శక్తి కేంద్ర ప్రముఖులు బూతు కమిటీ అధ్యక్షులతో జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, గోల్డెన్ వ్యాలీ రమణారెడ్డి, బి గోపాల్ రెడ్డి, ఎల్లంపల్లె ప్రశాంత్, రామ మోహన్, శోభారాణి మండల అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డిలు సభ్యులందరినీ ఆప్యాయంగా పలకరించి సమావేశ ఉద్దేశాలను బూత్ కమిటీలకు వివరించారు. ఈ సమావేశంలో చల్లపల్లి నరసింహారెడ్డి మాట్లాడుతూ జనతా పార్టీని గ్రామీణ స్థాయిలో బలోపేతం చేసే ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలకు దగ్గర అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మండల కమిటీ జనరల్ సెక్రటరీలు ప్రసన్న కుమార్, కరుణాకర్ రెడ్డి, సీనియర్ కార్యకర్తలు ఎం రాజారెడ్డి, సిద్దారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మాధవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ రాయుడు, లక్ష్మీదేవి, నరిసింహులు, చిన్నప్ప, మారపురెడ్డి, గణేష్, సుమంత్, సోమశేఖర్ మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి మిథున్‌కు లేదు

సిద్దవటం నవంబర్ 16 ప్రభాతవార్త



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి మిథున్ రెడ్డికి లేదని జనసేన రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. మండలకేంద్రమైన సిద్దవటంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కాంలో జైలు జీవితాన్ని మిథున్ రెడ్డి మరచి మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎర్రచందనం, ఇసుక మాఫియా, భూకబ్జాలు విపరీతంగా చేశారనిపేదల కోసం ప్రవేశపెట్టిన ప్రతి స్కీములో వైసీపీ నేతలు స్కామ్‌లు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రామ పంచాయతీలను బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జనసేనాని పవన్ కళ్యాణ్‌పై, కూటమి ప్రభుత్వంపై మిథున్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హితవు పలికారు.

## గజ్జ పూజ పురాతనమైన సంప్రదాయం

సిద్ధవటం, నవంబర్16 ప్రభాతవార్త



పురాతనమైన సంప్రదాయాలతో తెలుగుజాతి గర్వపడేలా ప్రత్యేక గజ్జ పూజ, కోలాటాలు మధ్య గజ్జ పూజ కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా మహిళలకు రాజంపేట జనసేన పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ కుటుంబీకులు చీరలు పంపిణీ చేపట్టడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ మాట్లాడుతూ పురాతనమైన సాంస్కృతిక కార్యక్రమాల కోలాటాలు రాష్ట్రస్థాయిలో ఏ కార్యక్రమం చేపట్టిన ముందుగా గుర్తుచేది పురాతన సాంప్రదాయమైన కోలాటాలు, గుర్తొస్తాయని అలాంటి పురాతన గజ్జ పూజ కోలాటాలు ఆకుల వీధిలో జలపడం శుభ పరిణామం అన్నారు. గ్రామంలో ప్రత్యేక గజ్జ పూజ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు.

## పురుగుల మందు సేవించి రైతు ఆత్మహత్య

దువ్వూరు, నవంబర్ 16, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఇడమడక గ్రామంలో గడ్డి నివారణకు వినియోగించే పురుగుల మందును సేవించి మామిళ్ల సుబ్బరాయుడు(67) చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. వివరాలు ఇలా ఉన్నాయి...ఇడమడక గ్రామంలో సొంత వ్యవసాయ భూమితో పాటు కౌలు భూమిని కలుపుకొని సుమారు 10 ఎకరాలు వ్యవసాయం చేసేవాడు. పంటలలో సరైన రాబడి రాక నష్టాలు రావడంతో గ్రామంలోనూ ఇతర చోట్లను సుమారు 10లక్షల రూపాయల మేరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక ఈ నెల 4వ తేదీన గడ్డి నివారణ పురుగు మందును సేవించాడు. వెంటనే గ్రామస్థులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు.

## కోటి దీపోత్సవం విజయవంతం

బద్వేలు, నవంబర్ 16 , ప్రభాతవార్త



నియోజకవర్గం వల్లెరవారి పల్లె గ్రామములో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నందు శనివారం కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల ఆలయ పూజారి పెంచలయ్య స్వామి ఆదివారం పట్టణంలోని పద్మావతి మెడికల్ స్టోర్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదని ఈ మాసంలో చేసిన ప్రతి చిన్న పని పెద్ద పుణ్యాన్ని కలుగజేస్తుందన్నారు. ఇందులో భాగంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కోటి దీపోత్సవం కార్యక్రమంలో భక్తులు పాల్గొని కోటి దీపాలను వెలిగించడం సర్వ సుభదాయకమన్నారు. కోటి దీపోత్సవ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి అధిక వేలాది మంది భక్తులు పాల్గొని ఈశ్వరి ని రుద్రాభిషేకం పూజ కార్యక్రమం తిలకించి ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన దీప సామాగ్రిని భక్తులు భక్తి శ్రద్దలతో వెలిగించారన్నారు.

## కె.వి పల్లి మండల కార్యవర్గ సమావేశం

పీలేరు నవంబర్ 16 ప్రభాతవార్త:



స్థానిక పీపుల్ పాఠశాల ఆవరణంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆపస్ అసోసియేట్ ప్రెసిడెంట్ పచ్చార్ల సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కె.వి పల్లి మండల ఆపస్ అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శిగా హరినాయక్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఎన్నికల పరిశీలకులుగా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నరసింహులు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సి కమిటీని నియమించాలని, కమిటీ నివేదిక ఇచ్చే లోపు మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు యాప్ల భారాన్ని తగ్గించాలని కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఇంకా ఇవ్వాల్సిన 3 డిఏలను ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. పిఎస్ హెచ్ఎంలుగా ఎస్జీటీలకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఎస్జిటి ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్ జైపాల్ రెడ్డి ఓబుల్ రెడ్డి ఆర్థిక కార్యదర్శి శివశంకర్ చంద్రకళ శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మాట ఇవ్వడం కాదు డబ్బులు ఇవ్వు బీటెక్ రవి

పులివెందుల నవంబర్ 16 ప్రభాత వార్త :



రైతులకు బీటెక్ రవి నా సొంత నిధులు ఇస్తానని మాటల్లో చెప్పడం కాదు చేతుల్లో చేసి చూపించాలని మాట ఇచ్చిన ప్రకారం రైతులకు డబ్బులు చెల్లించావా అని నిన్ను నమ్మే పరిస్థితిలోఏ రైతులు లేరు అని వైకాపా నాయకులు సింహాద్రిపురం మండలం అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, అజ్జుగుట్టు భాస్కర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ సర్వతం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, చంద్రమోళిలు అన్నారు. ఆదివారం స్థానిక వైయస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీటెక్ రవి నీవు బ్లఫ్ మాస్టర్ ఆలోచన మానుకొని చిత్తశుద్ధితో నిజాయితీగా రాజకీయాలు చేయాలన్నారు. అధికారం లో లేకున్నా మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి రైతుల మీద ఉన్న ప్రేమతో హెక్టార్ కు 20వేల రూపాయలతో 670 మంది రైతులకు దాదాపు 1.4 కోట్ల రూపాయలు సొంత నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. రైతుల కోసం ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు సొంత నిధులతో చేసినా ఘనత వైయస్ కుటుంబీకులదే అన్నారు. అక్రమంగా ప్రజల సొమ్ము దోచుకుంటున్న నీ అనుచరులను గాడిన పెట్టాల్సిన నువ్వుఇంకా వారిని రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం దారణమన్నారు. ఇటీవల కోమనూతల గ్రామ రైతుల మోటార్ కేబుల్ దొంగతనం చేసిన దొంగలను పట్టుకొని రికవరీ చేసిన కేబుల్ వైర్ లను ఇప్పటివరకు రైతు సోదరులకు అందివ్వలేకపోతున్నారు. అంటే రైతుల పట్ల నీ చిత్తశుద్ధి అర్థం అవుతుంది అని విమర్శించారు.

## ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ కోటి సంతకాల కార్యక్రమం

చిట్వేలి, నవంబర్ 16,ప్రభాతవార్త:



రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తున్న నేపథ్యంలో దానిని వ్యతిరేకిస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పోలోపల్లి గ్రామంలో వైసిపి నాయకులు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేటీకరణతో పేదవానికి వైద్య విద్య ఇక అందని ద్రాక్షగా మారుతుందని ఆందోళన వ్యక్తపరిచారు. కార్యక్రమంలో చిట్వేలి ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మలిశెట్టి వెంకటరమణ, సర్పంచులు సంగరాజు వెంకటసుబ్బమ్మ ,ఈశ్వరయ్య, వైఎస్ఆర్సిపి నాయకులు రమణారెడ్డి, శివారెడ్డి, గిరిబాబు, గులాం భాషా, చంద్రశేఖర్ రాజు,మంద సుధాకర్,నంది మండలం శ్రీనివాసులు, రాజగోపాల్ రాజు, ఆనాల శ్రీనివాసులు, ఆనాల నరసింహులు, నరసింహారెడ్డి, సుబ్రమణ్య రాజు, మీనుగ వెంకటసుబ్బయ్య, పందేటి కృష్ణంరాజు, కిరణ్ రాజు, పోలోపల్లి వైఎస్ఆర్సిపి యూత్ నాయకులు మరియు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కన్నుల విందుగా హిందూ కార్తిక వనభోజనము

కడప కార్పొరేషన్ నవంబర్ 16 ప్రభాతవార్త:

కులాలకతీతంగా హిందువులంతా ఒకే చోట కలిసి కార్తిక మాసంలో వనభోజనం చేయడం శుభ పరిణామమని తురిగానంద సరస్వతి, స్వస్వరూపానంద స్వామి, విరజానంద స్వామి పేర్కొన్నారు. శ్రీరాముడికి, శ్రీకృష్ణుని వారసులైన హిందువులంతా కలిసిమెలిసి జీవనం కొనసాగించాలన్నారు. ఆదివారం కడప చిన్మయ మిషన్ శ్రీ లలిత పంచాయతన దేవాలయం ఎదుట భారీ ఎత్తున హిందూ కార్తిక వనభోజనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం 6 నుంచి 8:00 వరకు శ్రీ కంటేశ్వర స్వామి మహన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకము 108 కలశ జలములతో ఆలయం చుట్టూ ప్రదక్షణ తీసుకొని వచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం గోమాతలకు పూజ చేశారు. ఉదయం 8:30 నుంచి 10:30 వరకు ఘనంగా శివపార్తుల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామీజీల ప్రసంగాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ చేతుల మీదగా మధ్యాహ్నం 12:30 నుంచి 4 గంటల వరకు హిందూ కార్తీక వనభోజనం నిర్వహించారు. హిందూ కార్తీక వనభోజనానికి 20వేల మంది హిందువులు పాల్గొన్నారు.

## జరగబోయే అన్ని ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

వేంపల్లె:నవంబర్:16:(ప్రభాత వార్త)



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా కృషి చేద్దామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) అన్నారు. ఆదివారం గండి రోడ్డులో మాజి ఫైనాన్స్ కోర్పరేషన్డైరెక్టర్ షబ్బీర్ ఆధ్యరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం టిడిపిపై అభిమానం ఉండి, పార్టీకీ దురమైన పాత టిడిపి నాయకులతో పాటు వేంపల్లెలోని ఆయా ప్రాంతాలకు చెందిన యువకులు, పలు కుటుంబాలు పార్టీ కండువా ధరించారు. ఎమ్మెల్యేగా మెజార్టీతో గెలవాలంటే, స్థానిక సంస్థల్లో తమ పార్టీ అభ్యర్థులు గెలిస్తే, వీరు ప్రజలతో మమేకమై వీరి సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా ఉంటుందన్నారు. దీంట్లో భాగంగా టిడిపి అభిమానంతో పార్టీకి దురమై ఉన్న పాత నాయకులు తిప్పారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, శివారెడ్డి, బాబు, సాదక్, అలాగే ఫక్కీర్ పల్లి, కాలేజీ రోడ్డుకు చెందిన దాదాపు 20 కుటుంబాలు తమ పార్టీలోకి చేరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ సంస్థ మాజీ డైరెక్టర్ షబ్బీర్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, టిడిపి ఉపాధ్యక్షుడు వీరభద్ర, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్, కార్యదర్శి తక్కోల షరీఫ్, నాయకులు భాస్కర్ రెడ్డి, ఫయాజ్, యాసిన్, ఇలియాస్, దొంతు సుబ్బారావు, రాజన్న, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## 21,22,న,హజ్రత్ మదార్ షావలి ఉరుసు

వేంపల్లె నవంబర్ 16 ప్రభాతవార్త

వేంపల్లెలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలిసిన హజ్రత్ జిందేషా మదార్ షావలి ఉరుసు మహోత్సవం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలంగాణ వలి, పీరా సాహెబ్, చ్చాద్ బాషా లు తెలిపారు. 520 సంవత్సరాలకు పూర్వం హజ్రత్ సయ్యద్ ఖాజా దర్బార్ జిందేషా మదార్ షావలి అరబ్ దేశం నుండి బయలు దేరి భారత దేశం నందు ప్రవేశించి సన్మార్గం, సత్ ప్రవర్తన కొరకు ప్రచారం చేస్తూ దేవభక్తి పారయణులై వేంపల్లె గ్రామంలోని బిడ్డాల మిట్టలోని పాపాఘ్ని నది ఒడ్డున నివాసం ఏర్పాటు చేసుకొని దైవ చింతనలో మునిగి ప్రజలకు దైవ సందేశాన్ని వినిపిస్తూ సజీవ సమాధి అయినట్లు తెలిపారు. 21 శుక్రవారం గ్రంథం, 22 శనివారం ఉరుసు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23వ తేదీన ఉదయం 6 గంటలకు తహలీల్ ఫాతెహా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## ఘనంగా అన్నప్రసాదం వితరణ

బద్వేల్ అర్బన్ నవంబర్. 16. ప్రభాతవార్త.



నెల్లూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ప్రారంభం బద్వేల్ టౌన్ నెల్లూరు రోడ్డు లో వెలసిన శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం యందు మండల కాల అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ గురు స్వాములు మాట్లాడుతూ శబరిమలలో జరిగినట్లుగా 16 నవంబర్ నుండి 26 డిసెంబర్ వరకు దాతలు, భక్తుల సహకారం తో ప్రతి రోజు మధ్యాహ్నం అన్న వితరణ మరియు రాత్రి అల్పాహారం గుడి యందు వితరణ చేయుచున్నారని, కావున అయ్యప్ప మాలదారులు, భవాని మాల దారులు గోవింద మాలదారులు పూజా కార్యక్రమము లలో పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీ సముద్రాల విజయ కుమార్, వైస్ చేర్మెన్ యంగళ జయ సుబ్బా రెడ్డి, డైరెక్టర్ కొప్పరపు ప్రభాకర్, సెక్రటరీ కొండపల్లి వెంకట సుభాష్ కుమార్, అవుల మునెయ్య గురు స్వామి, నల్లబల్లె వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పెద్దినేని వీర కామేశ్వరరావు మరియు ఆలయ గురు స్వాములు, అయ్యప్ప మాలదారులు భక్తులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి మృతి

కలసపాడు, నవంబర్ 16 ప్రభాతవార్త:

కలసపాడు మండలంలోని కలసపాడు టౌన్ నందు ఎస్టి కాలనీకి చెందిన దొమ్మర శ్రీనివాసులు (47) ఆదివారం ఉదయం ఇంటి సమీపంలోని వేప చెట్టుకు ఉరివేసుకొని చనిపోయినట్లు తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కలసపాడు ఎస్ఐ ఎల్. తిమోతి తెలిపారు. వివరాలలోకి వెళితే మృతుడు మద్యానికి బానిసై కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడని కడుపునొప్పి ఎక్కువ కావడంతో మద్యం మత్తులో ఉరివేసుకొని చనిపోయాడన్నారు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ళకు మృతదేహాన్ని తరలించామని ఆయన తెలియజేశారు.

## మహిళల భద్రత అవగాహన కార్యక్రమం

కలసపాడు, నవంబర్ 16 ప్రభాత వార్త:



మహిళల పట్ల భద్రత కలిగి ఉండాలని కలసపాడు ఎస్సైఎల్ తిమోతి తెలిపారు. ఆదివారం మండలంలోని పిడుగు పల్లె గ్రామంలో జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కలసపాడు ఎస్ఐ ఎల్ తిమోతి మహిళలకు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఏ చిన్న సమస్య వచ్చినా శక్తియాపు, డయల్ 112 ఉపయోగించి వాటి సేవలద్వారా సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని పై విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తి యాప్ ద్వారా మేమే అతి తక్కువ సమయంలో వాళ్ళ సమస్యను వారి ఇంటి దగ్గరికి వెళ్లి పరిష్కరిస్తామని మహిళలకు భరోసా ఇచ్చారు.

## కళాకారులు ఐకమత్యంగా ఉండి అభివృద్ధి చెందాలి

పోరుమామిళ్ల రూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త:



పోరుమామిళ్ల పట్టణంలోని మల్లకత్వ సమీపంలో ఉన్న వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి మెమొంటో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులంతా ఏకమై మన పోరుమామిళ్ల ప్రాంతంలో సమావేశం కావడం అభినందనీయమన్నారు. జానపద కళాకారులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఆయనతోపాటు టిడిపి నాయకులు పోలిరెడ్డి, కృష్ణారెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

## కాడెద్దులు మృతి.. దిక్కుతోచని స్థితిలో రైతన్న

పోరుమామిళ్ల రూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త:

కాశీనాయన మండలంలోని రెడ్డికొట్టాల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన బాలనాగాల శివయ్య అనే రైతు ఆధారం కోసం రెండు ఎద్దులను దాదాపు రెండు లక్షల రూపాయలతో కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటూ జీవనాధారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం వేరే రైతు పొలం దున్నేందుకు బాడుగకు పిలువగా అతను గ్రామ సమీపాన ఉన్న సగిలేరు నది ఒడ్డున సేద్యానికై రెండు ఎద్దులతో వెళ్ళాడు. సేద్యం అయిపోయిన దాదాపు మూడున్నర గంటల సమయ ప్రాంతంలో తిరిగి తమ గ్రామానికి రావడానికి పది కిలోమీటర్ల దూరం తిరిగి రావడానికి ఇబ్బందికరంగా అవడంతో సగిలేరు 200 మీటర్లు అవతలి ఒడ్డుకు చేరుకుంటే ఈజీగా తనము గ్రామానికి ఆలోచనతో బయలు దేయడం జరిగింది. సగిలేరు లో కొద్ది దూరం రావడంతో ఈ మధ్య కురిసిన అకాల వర్షాలతో సగిలేరు ఉధృతంగా ప్రవహించడంతో అక్కడక్కడ గుంటలు ఏర్పడి సగిలేని సుడిగుండాలు మాదిరి ఏర్పడం జరిగిందనే విషయం తెలుసుకొని ఆ రైతు సగిలేరు దాటుతున్నంగా ఎద్దులతో సహా దాటుతున్న నేపథ్యంలో కొద్ది దూరం ఎద్దులతో అతను రావడంతో సుడిగుండంలో ఎద్దులు చిక్కుకుపోవడంతో అతను కూడా చిక్కుకొని ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడడంతో తన ఎద్దులు తన ప్రాణాలు కాపాడి తమ ఎద్దులు ప్రాణాలు కోల్పోవడం జరిగిందని ఆ రైతు బోరున విలపించడం జరిగింది. ఈ విషాద సంఘటన చాలా బాధాకరమని అతని కన్నీరు మున్నూరుగా విలపిస్తున్నాడు. ఏది ఏమైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

## మైనార్టీల పట్ల చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వం

వేంపల్లె: నవంబర్ 16:(ప్రభాత వార్త)



రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మైనార్టీల పట్ల చిత్తశుద్ధి కలిగి ఉందని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి వేంపల్లె మండల అధ్యక్షుడు మహబూబ్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా వేంపల్లె మండల ప్రభుత్వ ఖాజీగా నియామకమైన స్థానిక జామీయ మసీదు ఇమామ్ అబ్దుల్ రహమాన్ ని, టిడిపి ఇంఛార్జీ బిటెక్ రవి, నాయకులు రామమునిరెడ్డి, మహమ్మద్ షబ్బీర్, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డిలను శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి, 2025-26 ఆర్థిక బడ్జెట్ లో రూ. 90 కోట్లు విడుదల చేసిందని, ఇమామ్, మోజన్ లకు గౌరవవేతనం చెల్లించేందుకు ఆమోదంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే వేంపల్లె మండల ప్రభుత్వ ఖాజీగా నియామకం పట్ల, అందుకు కృషి చేసిన పార్టీ ఇంచార్జీ బిటెక్ రవి, మైనారిటీ ఫైనాన్స్ సంస్థ మాజీ డైరెక్టర్ షబ్బీర్, కన్వీనర్ రామమునిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెడికల్ బాబు, యాసీన్, జభిల్లాహ్, షరీఫ్, హుస్సేన్,తదితరుల నాయకులు పాల్గొన్నారు.

## రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

రామసముద్రం నవంబర్ 16ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు రచ్చబండ కార్యక్రమం, గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా మదనపల్లి నియోజకవర్గం రామసముద్రం మండలం నందు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కన్వీనర్ కేశవరెడ్డి విన్నవించారు. ఈ మేరకు పత్రికా ప్రకటన ద్వారా రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రామసముద్రం మండలం నడింపల్లె, చెంబకూరు, గజ్జలవారిపల్లె, నారిగానిపల్లె, కమ్మవారి పల్లె ఎలకపల్లె పంచాయతీ నందు కార్యక్రమం జరుగును.

## కిడ్నీ రాకెట్ నిందితులకు వైద్య పరీక్షలు



మదనపల్లె క్రైమ్, నవంబర్ 16 ప్రభాతవార్త.

మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రి కేంద్రంగా రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ కేసులో అరెస్టు చేసిన నిందితులకు పోలీసులు ఆదివారం మధ్యాహ్నం వైద్య పరీక్షలు పూర్తి చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. మదనపల్లి 2వ పట్టణ సీఐ రాజారెడ్డి తన సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు మధ్య పోలీస్ వాహనంలో నిందితులను ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ ఆంజనేయులు (గ్లోబల్ ఆసుపత్రి యజమాని, చిత్తూరు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి), బాల రంగుడు అలియాస్ బాలు (మదనపల్లి డయాలసిస్ కేంద్రం మేనేజర్), మెహారాజ్ (కదిరి డయాలసిస్ సెంటర్ మేనేజర్), బ్రోకర్లుగా వ్యవహరించిన పెళ్లి పద్మ, కాకర్ల సత్య, మృతురాలు యమున స్నేహితుడు సూరిబాబులకు వైద్య పరీక్షలు పూర్తయిన అనంతరం నిందితులను స్థానికంగా ఉండే న్యాయమూర్తి హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు సబ్ జైలుకు తరలించారు. విశాఖపట్నంకు చెందిన ఎస్. యమున (29) అనే మహిళను డబ్బు ఆశ చూపి కిడ్నీ దానం కోసం ఒప్పించి, నవంబర్ 9న మదనపల్లెలోని గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చట్టవిరుద్ధంగా ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ వికటించడంతో ఆమె నవంబర్ 10న మరణించడంతో ఈ కిడ్నీ రాకెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో మొత్తం 15 మందితో కూడిన ముఠా ఉన్నట్లు గుర్తించారు, అందులో భాగంగా ప్రస్తుతం ఆరుగురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగతా నిందితులు, ముఖ్యంగా బెంగళూరుకు చెందిన డాక్టర్ కోసం నాలుగు ప్రత్యేక బృందాలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవా, తెలంగాణ రాష్ట్రాల్లో గాలిస్తున్నాయి.

## సార్వత్రిక బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలు




పెద్దమండెం నవంబర్ 16 ప్రభాతవార్త

సార్వత్రిక బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 14 నుండి 20 వరకు నిర్వహించడం జరుగుతుందని కోర్టు సమస్త కోఆర్డినేటర్ నరసింహులు తెలిపారు ఆదివారం మండలంలోని సిద్దవరం కస్తూరిబా గురుకుల పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పెద్దలు పిల్లల యొక్క యోగ క్షేమాలు వారి హక్కుల పై అవగాహన కల్పించారు అనంతరం పిల్లలకు పాటల పోటీలో డ్రాయింగ్ ఆటల పోటీలు నిర్వహిం చారు ప్రతి ఒక్క బాలల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఫోర్డ్ సంస్థ సిబ్బంది అనిత భువనేశ్వరి శైలజ రమణ విద్యార్థులు పాల్గొన్నారు.

## కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన



తంబళ్లపల్లె నవంబర్ 16 ప్రభాతవార్త ః

మండలంలోని కుక్కరాజుపల్లె, రెడ్డి కోట పంచాయతీలలో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకతపై వైకాపా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించినట్లు వైకాపా మండల అధ్యక్షుడు రేపన చౌడేశ్వర తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు రెండు పంచాయతీలలోని గ్రామాలలో వైకాపా నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రతి గ్రామంలో ఇంటింటా పర్యటించి కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకతపై కోటి సంతకాల లో భాగంగా ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేపట్టారు. వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలాకోటిరెడ్డి, నరేందర్ రెడ్డి, రెడ్డి కోట రామస్వామి, తాళ్ల చంద్రశేఖర్, ఎంపీటీసీలు మహేష్, పద్మనాభ రెడ్డి, పుల్లారెడ్డి శంకర్ రెడ్డి, హరి ప్రసాద్, రమేష్, షరీఫ్, బాబజాన్, రఘునాథ్ రెడ్డి, ఛాయాపతి రెడ్డి, అరుణ్ కుమార్ రెడ్డి, మున్న స్కాన్, రవి, పుల్లారెడ్డి, సిద్ధమల్లు, రమేష్, హరి, బాలు, పద్మనాభరెడ్డి, రామ్మూర్తి, రెడ్డికోట మాజీసర్పంచ్ శ్రీరాములు, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## బాలుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

తంబళ్లపల్లె నవంబర్ 16 ప్రభాతవార్త ః



మండలంలోని దిగువపాలెం పంచాయతీకి చెందిన విద్యార్థి అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని దిగువపాలెం చింతల రేవుపల్లెకు చెందిన వడ్డిపల్లి దామోదర కుమారుడు వడ్డిపల్లి రాజు (15) ములకల చెరువు మండలం వేపూరు కోట లోని హైస్కూల్లో ఇంగ్లీష్ మీడియం పదవ తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజు లో భాగంగా రాజు శనివారం పాఠశాలకు చింతల రేవు పల్లె నుండి నుండి బస్సులో వేపూరు కోటకు వెళ్ళాడు. అక్కడ గ్రామస్తులకు సైతం కనపడ్డాడు. సాయంత్రం రాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది సంబంధిత పాఠశాల టీచర్ ను విచారించగా రాజు పాఠశాలకు రాలేదని చెప్పారు. అనంతరం బంధువులు ఇళ్ళల్లో వెతికిన ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం రాజు తండ్రి దామోదరం తంబళ్లపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## గుండెపోటుతో నర్సరీ రైతు మృతి.

తంబళ్లపల్లె నవంబర్ 16 ప్రభాతవార్త ః



మండల కేంద్రంలోని క్రాస్ రోడ్ మసీదు వీధిలోని నర్సరీ నిర్వాహక రైతు తుపాకుల వెంకటరమణ (59)కు ఆదివారం గుండెపోటు రావడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తరలించడానికి ప్రయత్నించే లోపే మృతి చెందాడు. ఆయన మృతితో ఆ నిరుపేద కుటుంబం పెద్దదిక్కు కోల్పోవడంతో శోకసముద్రంలో మునిగిపోయింది. ఆయనకు భార్యతో పాటు ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కత్తితో దాడిచేసిన నిందితుడు అరెస్టు

రామసముద్రం నవంబర్ 16 ప్రభాతవార్త :



రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె గ్రామంలో యువకునిపై కత్తితో దాడిచేసిన వ్యక్తిని అరెస్టు చేసి జడ్జి ముందు హాజరు పరిచారు. ఈనెల 14న పెద్దకురప్పల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు అశోక్‌కుమార్, అదే గ్రామానికి చెందిన హరితో తగాదాల కారణంగా హరివెంట తెచ్చుకొన్న కత్తితో అశోక్‌కుమార్‌పై దాడిచేసి పొడిచాడు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి హరిని అరెస్టు చేసి వైద్యపరీక్షలు పూర్తి చేసిన అనంతరం ఆదివారం జడ్జి ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ నేరస్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

## సిఐ సత్యనారాయణ బదిలీ

మదనపల్లెక్రైం, నవంబర్ 16 ప్రభాతవార్త :

మదనపల్లె రూరల్ సర్కిల్ సిఐ సత్యనారాయణను అనంతపురంకు బదిలి చేస్తూ కర్నూలు రేంజ్ డిఐజి కొయప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లా శ్రీసిటి పిఎస్3 లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రవినాయక్‌ను మదనపల్లెరూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఏడాదికి పైగా రూరల్ సర్కిల్‌సిఐగా వున్న సత్యనారయణ పలుకేసులను చాకచక్యంగా పరిష్కరించి, ప్రజల మన్ననలు పొందారు.

## లెక్కల మాస్టారుకి కన్నీటి వీడ్కోలు

పీలేరు నవంబర్ 16 ప్రభాతవార్త:



మృతదేవానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గురువులకే గురువైన లెక్కల మాస్టారు, విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి కంబిరెడ్డి వెంకట రెడ్డి (85)కి కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందిన ఆయనకు కుటుంబ సభ్యులు ఆదివారం పీలేరు సమీపంలోని మొరవపల్లి వద్ద తమ సొంత భూమిలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు అక్కడకు చేరుకుని ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## గ్రంథాలయ పితామహులకు ఘన నివాళి



మైదుకూరు, నవంబర్ 16, ప్రభాతవార్త:

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 3వరోజు మైదుకూరు శాఖ నందు 16 నవంబర్ 2025 తేదీ గ్రంథాలయ పితామహులు మరియు ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాల సమర్పించి ఘన నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు పొలిమేర ఓబన్న మాట్లాడుతూ గ్రంథాల పితామహులు మరియు ఉద్యమకారుల వలన ఈరోజు దేశవ్యాప్తంగా గ్రంథాలయాలు ఏర్పాటు కావడం జరిగిందని కావున గ్రంథాలయాల వలన కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరికి తెలియజేసి గ్రంథాలయాలకు వస్తున్న పాఠకులను పెంచే ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, చెన్నారెడ్డి, లక్షుమయ్య, రాజా, సుబ్బారెడ్డి, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ ప్రమోషన్లు వెంటనే చేపట్టాలి




రాయచోటి నవంబర్ 16 ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ (భాష పండిట్) పోస్టులను భర్తీ చేయడానికి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు అమలు చేయాలని నోబెల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటిలో నిర్వహించిన రాయచోటి డివిజన్ నోబెల్ టీచర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్‌లో బదిలీ పొంది ఇప్పటికీ రిలీవ్ కాకుండా ఉన్న ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. టెట్ పరీక్షపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఫిర్యాదు దాఖలు చేసినందుకు అభినందిస్తూ, కేంద్ర ప్రభుత్వంతో కూడా చర్చలు జరిపి ఉపాధ్యాయులకు అనుకూలమైన నిర్ణయం తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవాధ్యక్షులు రెడ్డి రమేష్ మాట్లాడుతూ నోబెల్ టీచర్ అసోసియేషన్ నిర్మాణం పూర్తిగా మండల స్థాయిలోనే బలోపేతం అవుతుందని, అందువల్ల మండల కమిటీలు సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టాలని సూచించారు. అనంతరం డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. గెజిటెడ్ పదోన్నతులకు స్టేటస్కో లేనందున ప్రధానోపాధ్యాయులకు డైట్ సీనియర్ లెక్చరర్లుగా, స్కూల్ అసిస్టెంట్లకు లెక్చరర్లుగా పదోన్నతలకు ప్రభుత్వం చర్యలు చేపట్టేలా కృషి చేయాలన్నారు. తర్వాత వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సురేష్ కుమార్, ప్రధానోపాధ్యాయులు జయన్న, వేణుగోపాలరావు, దుర్గేశ్వర్‌రాజు, రియాజ్, రామకృష్ణ నాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## తెలుగువాడి ఖ్యాతిని చాటిన వ్యక్తి రామోజీ

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 16 ప్రభాతవార్త



స్థానిక శ్రీరాములు పేట లోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో రామోజీరావు 88 వ జయంతి వేడుకలు నిర్వహించారు. మొదటగా ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు వరుణ్‌కుమార్‌రెడ్డి రామోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సినిమా రంగంలో ప్రవేశించి ప్రపంచంలోనే అతిపెద్ద రామోజీ ఫిలిం సిటీని నిర్మించి దానికి గిన్నిస్‌బుక్‌లో స్థానం కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం నాయకులు కొండయ్య, సాయికుమార్, గంగాధర్, ప్రసాద్, సుధాకర్, సుబ్బారెడ్డి, అధ్యాపకులు కూరపాటి శ్రీనివాసుల రెడ్డి, రామోజీ అభిమానులు సూరి, షేక్షావల్లి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

మైదుకూరు, నవంబర్ 16, ప్రభాతవార్త:

మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రొద్దుటూరు నందు నిర్వహించిన ప్రజా దర్బార్ ప్రజల నుంచి పలు సమస్యల పై నేరుగా అర్జీలను స్వీకరించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రహదారులు, సిమెంటు రోడ్లు, ఏర్పాటు, భూ ఆక్రమణలు, రెవెన్యూ, విద్యుత్ సమస్యలు, ఇంటి స్థలాలు, పక్కా ఇండ్ల కొరకు, తదితర అంశాలపై ప్రజలు పలువురు అర్జీల రూపంలో ఎమ్మెల్యే దగ్గరికి రావడం జరిగింది. ప్రజా దర్బారులో ఇచ్చిన అర్జీలు, ఫిర్యాదు పత్రాలను పరిశీలించి, సంబంధించిన శాఖ అధికారులు, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పట్ల శ్రద్ధ వహించి బాధ్యతగా పనిచేయాలని అలాగే స్మశాన స్థలాల ఆక్రమణ గురించి సర్వే చేయించి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడం జరిగింది. వ్యవసాయ రంగానికి సంబంధించిన విద్యుత్ సిబ్బంది కూడా రైతులను నిరక్ష ్యంగా చేయడం సరికాదని ముఖ్యంగా విద్యుత్ లైన్ మెన్లు రైతు లకు అందించే విద్యుత్ విషయంలో చాలా శ్రద్ధ వహించాలని తెలియజేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి




లక్కిరెడ్డిపల్లి నవంబర్ 16 ప్రభాతవార్త

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దీంతో దోమల నివారణయి రోగాలు దూరం అవుతాయని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోవాటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. నేషనల్ సర్వీస్ స్కీమ్ లో భాగంగా ఈనెల 12వ తేదీ నుంచి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులచే ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చౌటుపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా చేయడము ప్రతి ఇంటికి అవగాహన కల్పించడం నిర్వహించారు ఆదివారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ముగింపులు భాగంగా గ్రామంలో పర్యటించి డ్రగ్స్ మారకద్రవ్యాలు బాల్య వివాహాలు అన్న విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

కురబలకోట, నవంబర్ 16 ప్రభాతవార్త :



గ్రంథాలయంలో ప్రసంగిస్తున్న దృశ్యం

కురబలకోట మండలంలోని గ్రంథాలయంలో 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారుల డాక్టర్ ఎస్ఆర్. రంగనాథన్, పాతూరి నాగభూషనం, ఐ.ఎస్.జి.వెంకటరమణయ్యలను స్మరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడతూ గ్రంథాలయాల్లోని పుస్తకాలు, న్యూస్‌పేపర్లు, వారపత్రికలు, జనరల్ పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లావణ్య, పద్మావతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయనిర్మాణం విగ్రహ ప్రతిష్ట

రామసముద్రం నవంబర్ 16 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని కర్ణాటక భార్డర్‌లోని కురుబురు గ్రామంలో నూతనంగా అయ్యప్ప స్వామి దేవాలయం ప్రారంభం విగ్రహ ప్రతిష్ట కనులు పండువగా నిర్వహించడం జరిగింది. అయ్యప్ప స్వామి దేవాలయాన్ని బిజెపి నారాయణరాజు సొంత నిధులు రాజకీయ నాయకులు, ప్రముఖులు గ్రామస్థులు సహాయ సహకారాలతో నూతనంగా ఆలయాన్ని నిర్మించి ఆదివారం విగ్రహప్రతిష్ట చేశారు. ఆలయ పునః ప్రతిష్టకు రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, అధికారులు, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి బెంగళూరు గానిగరల్లి రవికుమార్ రాజు (బాబు )రాధ, వల్లాల దర్శన్ ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. రవికుమార్ మాట్లాడుతూ కురుబురు గ్రామంలో బిజెపి నారాయణరాజు ఆధ్వర్యంలో ప్రజల బాగస్వామ్యంతో అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రతిఒక్కరి కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, రాధ, రాజ, దర్శన్ రాజకీయ ప్రముఖులు, అధికారులు, బంధువులు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రతిష్ట లో పాల్గొన్న భక్తులకు నారాయణ రాజు, కరుణ రాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

## ప్రజలను మభ్య పెట్టడమే లక్ష్యంగా వరద వ్యాఖ్యలు

ప్రొద్దుటూరు నవంబర్ 16 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పురపాలక సంఘంలో 2019-24కు సంబంధించిన వైసీపీ పాలన లో ఎలాంటి అవినీతి జరగక పోయినా ప్రజలను మభ్య పెట్టడమే లక్ష్యంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి విమర్శించారు. ఆదివారం తన నివాసంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పనిచేసే దాదాపు 43 మంది అధికారులకు వచ్చిన నోటీసులు వారు అవినీతి చేశారని కాదని, కేవలం వారు నిబంధనలు ఉల్లంఘించినందుకే అని వివరించారు. దీనిపై వారు 15 రోజులలో ఉన్నతాధికారులకు వివరణ ఇస్తారని, ఆ తర్వాత కూడా ఉన్నతాధికారులు సంతృప్తి చెందని తరుణంలో విచారణ జరుగుతుందని, వారు తప్పు చేశారని తేలితే కేవలం వారికి 1 లేదా 2 ఇంక్రిమెంట్లు మాత్రమే తొలగిస్తారని, ఆ తర్వాత వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉందని వివరించారు. ఒకవేళ తమ పాలనలో అవినీతి జరిగి వుంటే 1180 పనులపై ఎమ్మెల్యే విజిలెన్స్ విచారణ చేయించిన తర్వాత కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ లక్ష్మీ దేవి, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యుల ఆందోళన

కలికిరి, నవంబరు 16, ప్రభాతవార్త:



ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

కలికిరిలో శుక్రవారం అర్ధ రాత్రి హత్యకు గురైన యువకుడు వినీత్‌కుమార్‌రాజు మృతిపై బాధితురాలు సుకన్య ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు స్పందించలేదని నిందితులపై కఠినమైన శిక్షలు పెట్టలేదని మృతుని కుటుంబ సభ్యులు పోస్టుమార్టం గది వద్ద ఆందోళనకు దిగారు. శుక్రవారం రాత్రి అబూ మొబైల్ షాపు యజమాని అబుబకర్, నౌషాద్, అహ్మద్, నరేష్‌లు యువకుడు అయిన వినీత్‌కుమార్‌రాజును తీసుకెళ్లి అతనిపై దాడి చేసి హత్య చేసినట్లు యువకుడి తల్లి సుకన్య పోలీసులకు పిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితునిపై 302, 201 ఐపీసీ అండర్ 34 ఐపీసీ సెక్షన్లు కింద కేసు నమోదు చేయడం జరిగింది. దీంతో మృతుడి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. నిందితులపై భారతీయ న్యాయ సన్నిహిత చట్టం 61 సెక్షన్ నమోదు చేయాలని ఆ సెక్షన్ ఎందుకు పెట్టలేదని పోలీసుల తీరుపై ఆందోళనకు దిగారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పీలేరు సీఐ యుగంధర్ కలికిరి సీఐ అనిల్‌కుమార్‌లు వచ్చారు. యుగంధర్ మాట్లాడుతూ న్యాయవాదులు ఇచ్చే సెక్షన్లు ఎందుకు నమోదు చేయాలని మీరు ఫిర్యాదు చేసిన మేరకు నిందితులపై శిక్షలు నమోదు చేయడం జరిగిందన్నారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు నిందితులపై సానుకూలంగా ఉంటూ పోలీసుల తీరు ఉందని తమకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు.

## కలికిరి సీఐ అనిల్‌కుమార్ బదిలీ

కలికిరి, నవంబరు 16, ప్రభాతవార్త:

కలికిరి పోలీసు స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న అనిల్‌కుమార్‌ను కడప ఏసీబీ సీఐగా బదిలీ చేస్తూ అన్నమయ్య జిల్లా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కొత్త సీఐగా రామచంద్రను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. కలికిరి సీఐగా బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్‌ను అతి తక్కువ కాలంలోనే బదిలీ చేయడం విశేషం. గత కొద్ది నెలలుగా కలికిరి మండలంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం కావడం ప్రతి నిత్యం ఏదో ఒక సంఘటన జరగడం వస్తూ ఉంది. బాధ్యతలు చేపట్టే సీఐ అయినా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అతనిపై ఉంది.

## మంత్రులను విమర్శించడం హాస్యాస్పదం

మదనపల్లె, నవంబర్ 16 ప్రభాతవార్త :



మాట్లాడుతున్న ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్‌లు

రాష్ట్ర మంత్రులు నాదేళ్ల మనోహర్, సత్య కుమార్‌యాదవ్, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిలను వైకాపా ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని మార్కెట్ యార్డు ఛైర్మెన్ జంగాల శివరామ్, వైస్ ఛైర్మెన్ రామిశెట్టి ఆంజినేయులు తెలిపారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా మార్కెట్‌యార్డు ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్, కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన మంత్రులు మార్కెట్‌యార్డు అభివృద్ధి, కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించడం జరిగిందన్నారు. అయితే వైకాపా ఇన్‌చార్జ్ మంత్రులు మదనపల్లెకు ఎందుకు వచ్చారో అంటూ వ్యంగంగా మాట్లాడడం సభబుగా లేదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో సంక్షేమంతో పాటు ఎంతో అభివృద్ది జరుగుతోందన్నారు. గత వైకాపా పాలనలో జరగని విధంగా కూటమి ప్రభుత్వం అభివృద్దిని చేసి చూపిస్తుందన్నారు. పౌరసరఫరాల శాఖలో అవినీతికి ఎలాంటి తావు లేకుండా పేదలకు చౌకదుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. పిపిపి విధానంతోనే మెడికల్ కళాశాలల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. అభివృద్దిని చూసి ఓర్వలేకనే వైకాపా నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బర్నేపల్లి రవికుమార్ సంధ్యారాణి, డాక్టర్ అజంతుల్లాఖాన్, సుబ్రమణ్యంరెడ్డి, మున్నా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రతిరోజూ ప్రజాదర్బార్

మదనపల్లె, నవంబర్ 16 ప్రభాతవార్త :



సమస్యలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రతి రోజూ ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అర్బన్‌తో పాటు రూరల్ మండలం, రామసముద్రం, నిమ్మనపల్లె మండలాలకు చెందిన ప్రజలు వివిద సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ప్రజలు విన్నవించిన ప్రజాసమస్యలను ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో ప్రజలు విన్నవించిన సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ప్రతిరోజూ ప్రజాదర్బార్‌లో ఏదైనా సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. పిజిఆర్ఎస్‌లో విన్నవించిన సమస్యలు కూడా తన దృష్టికి వస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా రెవెన్యూ, భూ సమస్యలు, రోడ్లు, మురుకునీటి కాలువలు, సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలు ఎక్కువుగా విన్నవించుకోవడం జరిగింది.

## వైకాపా కార్యాలయంపై దాడి హేమమైన చర్య

### నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్

మదనపల్లె, నవంబర్ 16 ప్రభాతవార్త :




మాట్లాడుతున్న నిస్సార్‌అహ్మద్

హిందూపురం వైసిపి కార్యాలయంపై టిడిపి నాయకులు దాడి చేయడం హేమమైన చర్య అని నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్ తెలిపారు. ఆదివారం మున్సిపాలిటి పరిధిలోని 1, 2, 29, 35వ వార్డుల్లో కోటి సంతకాల రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు రోజు రోజుకు హెచ్చుమీరు తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలక్రిష్ణ సూచనలతోనే వైకాపా కార్యాలయంపై దాడులు చేయడం జరిగిందన్నారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా దాడులు చేయడం మంచి సంస్కృతం కాదన్నారు. వైకాపా పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ పార్టీలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు మంజూరు చేశారన్నారు. పిపిపి విధానంతో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే నిరుపేద ప్రజలకు వైద్యం దూరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పరిశీలకులు అనూషారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, ఆర్‌వి.శివారెడ్డి, ఎస్‌వి.రమణ, డిష్ రామక్రిష్ణారెడ్డి, నాయకులు విఎస్.రెడ్డి, రేపన ముణి, ఇర్ఫాన్‌ఖాన్, శరాదారెడ్డి, చిప్పిలి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జితో విచారణ జరిపించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె, నవంబర్ 16 ప్రభాతవార్త :



కిడ్నీ రాకెట్ ముఠాపై జిల్లా జడ్జిచే సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్లోబల్ ఆసుపత్రిని సిపిఎం నాయకులు హరిశర్మతో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిడ్నీ దొంగల చేతిలో కిడ్నీలు పోగొట్టకొన్నది ఎక్కడివారు, కిడ్నీలతో లబ్దిపొందిన వారు ఎక్కడెక్కడ ముఠా సంబ్బంధాలు ఉన్నాయన్న విషయాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కిడ్నీ రాకెట్ ముఠాలో ఆరుమందిని అరెస్టు చూపిన పోలీసులు మిగిలిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని తెలిపారు. కిడ్నీ రాకెట్‌లో ఎంతటివారినైనా ఉపేక్షించకూడదన్నారు. కిడ్నీరాకెట్‌పై అసలైన దొంగల ముఠాను పట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కేసు నీరుగారిస్తే ఆందోళన కార్యక్రమాటు చేపడుతామన్నారు.

## ప్రొద్దుటూరు శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 16 ప్రభాత వార్త

ప్రొద్దుటూరు శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారు అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఎస్సార్ రంగనాథన్, గాడిచర్ల హరి సర్వోత్తమ రావుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువులబాబు మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయాల స్థాపనకు దేశ, రాష్ట్రవ్యాప్తంగా ఎంతో కృషి చేశారని వారి కృషి లేనియెడల మనమందరం అవగాహన లేని నిరక్షరాస్యులుగా ఉండేవారమని, అలాగే రంగనాథన్ పుస్తకాలను సబ్జెక్టువైస్‌గా ఎలా అమర్చాలని గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల పైన ఎంతో కృషిచేసి గ్రంథాలయ పాటకులకు అవసరమైన లైబ్రరీ సైన్స్ పై ఐదు చట్టాలను రూపొందించారన్నారు. ఫైలాస్ లైబ్రరీ సైన్స్ ముఖ్య ఉద్దేశాలను అంటే ప్రతి చదవరికి ఒక పుస్తకం అందుబాటులో ఉంచాలని చదువరి సమయాన్ని వృధా చేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వరరెడ్డి విద్యార్థులకు చక్కటి పాట చేత విద్యార్థులను ప్రోత్సహించి తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని విద్యార్థులకు జానపద గేయ రూపంలో పాడి విద్యార్థులను ప్రోత్సహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య పురస్కార గ్రహీత ఆర్టిపి డిఇ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మేము చదువుకునే సమయంలో మాకు పుస్తకాలు గ్రంథాలయాలు సరిగా అందుబాటులో లేవని కానీ మీకు ఐదవ తరగతి నుండే గ్రంథాలయాలు అంటే ఏమిటి పుస్తకాలు అంటే ఏమిటి అనే విషయం మీకు తెలుసు కాబట్టి మీరు మీ యొక్క విరామ సమయంలో సమయాల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అభ్యసించాలని కోరినారు. గ్రంథాలయ పాఠకులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.



## అయ్యప్పలకు అన్నప్రసాదాలు ఏర్పాటు



**గాలివీడు, నవంబర్ 16(ప్రభాతవార్త):**
మండలం రోజులు ఎంతో భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో అయ్యప్ప మాలలు ధరించిన అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నామని గౌతమ్, రవిచంద్ర పాఠశాలల యాజమాన్యం షింటో ఇమ్మనుయల్, సైజుథామస్‌లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గౌతమ్ పాఠశాలలో 200 మంది అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ నియమ నిష్టలతో చేసే అయ్యప్ప దీక్ష మనిషి ప్రవర్తనలో మార్పు తీసుకువస్తుందన్నారు. మండల కాలం దీక్షలో ఉన్న భక్తుడు దీక్ష తర్వాత కూడా దుర్గుణాలను వదిలి సన్మార్గంలో నడిచేలా చేస్తుందని హితవు పలికారు.

## వైభవంగా బ్రాహ్మణ కార్తీక వన మహోత్సవం



ఉత్సవమూర్తుల ఊరేగిస్తున్న బ్రాహ్మణ సంఘు నాయకులు

**పీలేరు నవంబర్ 16 ప్రభాతవార్త:**
పీలేరులో బ్రాహ్మణ కార్తీక వన మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆదివారం స్థానిక శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని శివరాంపురం, గార్గేయ నదీ తీరాన వెలసిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో బ్రాహ్మణ కార్తీక వన మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవముగా నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్ర హోమం, పూర్ణాహుతి, మంగళహారతి చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణీంద్ర శర్మ ఇంటి నుండి శివపార్వతుల ఉత్సవమూర్తులు మేళ తాళాలతో ఊరేగింపుగా దేవాలయానికి తీసుకువచ్చి, అమ్మవార్లకు కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. అనంతరం సంఘ సర్వసభ్య సమావేశం అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు, పిల్లలకు ఆటపాటలు, కీర్తనలు, శ్లోకాలు, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. భోజన మంత్ర పఠనంతో కూడిన సహపంక్తి భోజనాలు చేసి, చివరిగా మహిళలచే గార్గేయ నదిలో కార్తీక దీపోత్సవం కన్నుల పండుగగా చేయించారు. ఈ కార్యక్రమంలో పీలేరు బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, ఉధ్యా ఫణీంద్ర శర్మ, నరసింహమూర్తి, జీవీఎస్ ఆర్కే ప్రసాద్, శ్రీధర్ స్వామి, గంజిగుంట సంతోష్ అయ్యర్, ఎల్ఐసి కుమార్, సుధాకర, విరూపాక్షం కాశీనాథ్, సూత్రం కిరణ్ కుమార్, ప్రభాకర్ రావు, కృష్ణ ప్రసాద్, వెంకటేశ్వరరావు, పీలేరు పరిసర ప్రాంత బ్రాహ్మణ కుటుంబీకులందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రంథాలయ ఉద్యమ కారుల కృషి మరువలేనిది



**పీలేరు నవంబర్ 16 ప్రభాతవార్త:**
గ్రంథాలయాల ఏర్పాటుకు గ్రంథాలయ ఉద్యమకారులు చూపిన కృషి మరువలేనిదని ఆంగ్లోపాధ్యాయులు పి. ప్యారూఖాన్ తెలిపారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం పీలేరు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్యల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించి వారి చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి గ్రంథాలయాల సేవలు ఎంతో ఉపయోగపడ్డాయని గుర్తు చేశారు. గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథం, పాటూరు నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, మాడపాటి హనుమంతరావు గ్రంథాలయాల అభివృద్ధికి వారు ఆడించిన సేవలు మరువలేనివని కొనియాడారు. గ్రంథాలయాధికారి అమరనాథ్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో గ్రంథాలయ ఉద్యమకారులు చేసిన సేవలు భారతీయులందరిలోనూ చైతన్యాన్ని నింపిందని గుర్తు చేశారు. నాటి గ్రంథాల ఉద్యమకారులు ప్రతి ఒక్కరు కూడా కొన్ని పత్రికలు స్థాపించి పత్రికల్లో తన వార్తలను రాసి భారతీయులందరినీ కూడా ఉత్తేజపరిచారన్నారు. గ్రామ గ్రామాన వందేమాతరాన్ని చాటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్‌షాహిర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వైకల్ క్యాన్సర్ మెడికల్ క్యాంపు

**పీలేరు, నవంబర్ 16 ప్రభాతవార్త:**
శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా పౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్ లో సంజీవిని ఉమెన్ హెల్త్ కేర్ పేరిట పీలేరులో సర్వైకల్ క్యాన్సర్ అవగాహన మరియు రక్షణ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించబడుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం 16 నవంబర్ 2025 నాడు, కాకతీయ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సంజీవని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. తిరుపతిలోని ప్రముఖ మెడిగో హాస్పిటల్ చెందిన గైనకాలజిస్టుల మరియు తదితర వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. మహిళా గైనకాలజిస్ట్ ల పర్యవేక్షణలో, పాల్గొన్న మహిళలందరికీ గర్భాశయ క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. మహిళల్లో సంభవించే వివిధ క్యాన్సర్లపై, అలాగే సర్వైకల్ క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన ప్రత్యేక శ్రధలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే 50 మంది మహిళలకు ఉచిత పాప్ స్మియర్ టెస్టులు చేశారు. అలాగే పాల్గొన్న వాళ్లందరికీ ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు ప్రోగ్రాం కోఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి (జడ్పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు), డా. జిలాని, షబ్బీర్, బాషా, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 126 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న అందరు మహిళలకి ఉపయోగపడేలా ఇంత మంచి ఉచిత వైద్యశిబిరాలు, అందులోనూ ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం మరియు ఉచిత గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ లు చేయడాన్ని అందరూ మెచ్చుకున్నారు. ఇలాంటి వినూత్నమైన ఆరోగ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ అలాగే ఈ కార్యక్రమాన్ని ఆర్థిక సహకారం అందిస్తున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



మెడికల్ క్యాంపులో పరీక్షిస్తున్న దృశ్యం

## కన్నుల పండుగగా భద్రావతి దేవి సమేత భావనాఋషి స్వామి కళ్యాణం





**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 16, ప్రభాతవార్త:**
పద్మశాలీయుల కుల దైవమైన శ్రీ భావనాఋషి స్వామి వారికి కార్తీక మాస చివరి శని, ఆదివారాల్లో విశేషంగా నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అంగరంగ వైభవంగా భావనారాయణ స్వామి భద్రావతి దేవి కళ్యాణం నిర్వహించారు. పట్టణం లోని రామేశ్వరం, శ్రీరామనగర్ ప్రాంతాల్లో వున్న స్వామి వారి ఆలయాలు ఈ వేడుకకు వేదికయ్యాయి. ముందుగా ఉదయం ఆలయ మూలవిరాట్టులను పట్టు వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక పుష్పాలంకరణ, పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఎదురుకోళ్ల మహోత్సవంతో కళ్యాణోత్సవం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు ఈ కళ్యాణం తిలకించారు. కళ్యాణం అనంతరం ఇరు ఆలయాల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు అన్నప్రసాద సేవ నిర్వహించారు. కాగా రాత్రి శ్రీరామనగర్ ఆలయం పరిసర ప్రాంతాలైన శ్రీరామనగర్, హనుమాన్ నగర్, మహేంద్ర నగర్, గీతాశ్రమం వీధి తదితర ప్రాంతాల్లో, అదేవిధంగా రామేశ్వరం ఆలయం పరిధిలోని రామేశ్వరం పురవీధులలో మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య స్వామి వారి గ్రామోత్సవం సాగింది. భక్తులు పాల్గొని కాయ, కర్పూరం సమర్పించి తమను చల్లగా కాపాడాలని వేడుకున్నారు.

## యాదవుల ఐక్యతే సమాజ వికాసానికి పునాది

**పులివెందుల, నవంబర్ 16, ప్రభాత వార్త :**
మండలం పరిధిలోని గుండాలయ్య కోనలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజన కార్యక్రమంకు పులివెందుల నియోజక వర్గ వ్యాప్తంగా వందలాది మంది యాదవులు, మహిళలు, యువత, పిల్లలు హాజరయ్యారు. ప్రతి ఏడాది కార్తీక మాసంలో శ్రద్ధతో నిర్వహించే ఈ వనభోజనం యాదవ సమాజంలో ఐక్యతకు, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తోంది. కార్యక్రమానికి ఉదయం నుంచే కుటుం బాలతో వచ్చిన యాదవ సోదరులు భక్తి కార్యక్ర మాలతో పాల్గొనడంతో గుండాలయ్యకోన పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మహిళలు సంత్సంగాలు, దీపాలర్పణలు చేస్తూ కార్తీక మాసానికి ప్రత్యేకతను చాటారు. ప్రముఖ యాదవ నాయకులు మాట్లాడుతూ యాదవులు దేశంలోని అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. రాజకీయాలు, విద్య, వైద్యం, వ్యాపారాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న సమాజం, మరింత ఐక్యతతో పనిచేస్తే ప్రతి రంగంలోనూ శిఖరాగ్రాలను చేరుకోవచ్చు అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వనభోజనాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం మొత్తంలో యాదవుల ఐక్యత బలపడేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తమవుతున్నాయి. ప్రతి ఏడాది మరింత పెద్ద ఎత్తున వనభోజనాన్ని నిర్వహించి సమాజాన్ని ఒకే దారిలో నడిపే దిశగా కృషి చేస్తామన్నారు. ఈసారి జరిగిన వనభోజనానికి గత సంవత్సరాల కంటే ఎక్కువ మంది హాజరయ్యారు.



కార్తీక వనభోజనానికి హాజరైన యాదవులు

## ఐక్యత చాటిన ఆర్యవైశ్యులు

- వైభవంగా ఆర్యవైశ్య చతుర్థ కార్తీక వనభోజన మహోత్సవం
- వసుదైక కుటుంబాన్ని తలపించిన ఆర్యవైశ్యులు
- అలరించిన శివసాయి ఈవెంట్స్ సాంస్కృతిక కార్యక్రమాలు





**బద్వేలు అర్బన్ ,నవంబరు16 ప్రభాతవార్త :**
బద్వేలు పట్టణంలోని శ్రీ ఆర్యవైశ్య చతుర్థ కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నెల్లూరు రోడ్డులోని సత్యాహైవేటౌన్‌షిప్‌లో కన్నుల పండగగా వేలాదిమంది ఆర్యవైశ్యులతో సత్యాటౌన్ షిప్ నిండిపోయింది. గ్రూప్ ఆర్గనైజింగ్ కమిటి సభ్యులు కేవి.సుబ్బారావు,వల్లంకొండు వెంకటరమణ, తుమ్మలపెంట సురేష్‌బాబు, పత్తి నాగేంద్రప్రసాద్, చెవుల వెంకటేశ్వర్లు, తులసివెంకట శివనారాయణ, పబ్బతి చంద్రశేఖర్, మదుళ్లపల్లె సునీల్‌కుమార్, పబ్బతి సత్యనారాయణ, జొన్నలగడ్డ సుధాకర్, సి.వి.నాగేశ్వరరావుతో పాటు పలువురు సేవాసంఘం కమిటి సభ్యుల సహకారంతో ఉదయం 9గంటలకు మొదటగా మహా శివునికి వివిధ రకాల ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకం కార్యక్రమానికి శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య నిర్వహించారు. వనభోజన మహోత్సవ కార్యక్రమంలో ప్రత్యేక అభిషేకంలో సత్యా టౌన్‌షిప్ అధినేత సముద్రాల సుబ్బారావు, సతీమణి పద్మావతి,అల్పాహారానికి సహకరించిన మార్కెట్‌యార్డు డైరెక్టర్ కొలిశెట్టి నాగరాజ, సతీమణి సుధారాణి తో పాటు పలువురు స్వామి వారి అభిషేకంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే తదుపరి జ్యోతి ప్రజ్వలనతో పలు కార్యక్రమాలను ప్రారంభించారు. అలాగే శివసాయి ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు గతంలో ఎన్నడూ లేనివిధంగా పలువురిని ఆకట్టుకునేలా నిలిచాయి. అనంతరం వనభోజనానికి విచ్చేసిన పలువురికి సేవా కమిటి సభ్యుల సహకారంతో లైవ్ దోష, మరియు అల్పాహారం ఏర్పాటు చేశారు.. అనంతరం మధ్యాహ్నం ప్రపంచ ఆర్యవైశ్య మహసభ రాష్ట్రఅధ్యక్షులు దేవతి భగవన్నారాయణ కుటుంబ సభ్యుల సహకారంతో పలువురికి వివిధ రకాల రుచికరమైన వంటలను ఏర్పాటు చేశారు. అనంతరం పలువురు మహిళలు, చిన్నారులకు వివిధ రకాల ప్రత్యేక ఆటల పోటీల కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. సాయంత్రం అల్పాహార విందును ఏర్పాటు చేయడం జరిగింది. వన భోజన మహోత్సవాలకు బద్వేలు పట్టణం నుంచి పలువురు తిలకించేందుకు అన్ని రూట్లలో ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం పట్ల సత్యాటౌన్‌షిప్ వేదికగా ఆర్యవైశ్యులంతా కదం తొక్కారు. అనంతరం ఆర్గనైజింగ్ కమిటి సభ్యులు మాట్లాడుతూ పలువురు దాతల సహాయ సహకారాలతో కార్తీక వన భోజనాలను నాలుగవ సంవత్సరంఅంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం పలువురు దాతలను శాలువాతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**వన భోజనాలలో పలువురు ప్రముఖులు:**
శ్రీ సత్యాటౌన్‌షిప్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీ ఆర్యవైశ్య చతుర్థ కార్తీక వనభోజన మహోత్సవంలో స్టేట్ ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, బద్వేలు అర్బన్ ఎస్ఐ మాడిశెట్టి సత్యనారాయణ, మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత,వనితాక్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, నేలపాటి లక్ష్మీనారాయణ, మెంటా క్రిష్ణ, శ్రీ సాయి వేంకటేశ్వర ట్రేడర్స్ పార్ట్‌నర్ పత్తిరాజాగారి క్రిష్ణమూర్తి, మరియు వారి పార్టనర్స్, శ్రీ వెంకటగణేష్ ట్రేడర్స్ తులసి నాగరాజ, చాటకొండు సత్యనారాయణ ప్రసాద్, ఎస్‌వి.సుబ్బారావు, తుమ్మలపెంట వెంకటసుబ్బయ్య, పబ్బతి సత్యనారాయణ, పత్తిరా జాగారి శ్రీనివాసులుతో పాటు పలువురు ప్రముఖులు, వ్యాపారులు హాజరయ్యారు. వారికి ఆర్గనైజింగ్ కమిటి ఆధ్వర్యంలో ఆహ్వానం పలికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో మరెక్కడా లేని విధంగా బద్వేలు పట్టణంలో ఆర్యవైశ్యులందరూ పార్టీలకు, సంఘాలకు అతీతంగా కలిసి గత నాలుగుసంవత్సరాలుగా కార్తీ కమహోత్సవం పురస్కరించుకుని పలువురు ఆర్యవైశ్యులను ఒక వేదిక పైకి తెచ్చి మనమంతా ఒకే కుటుంబం అనే సూచనను పాటిస్తూ వన భోజన కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. కార్తీక మాసంలో వనబోజనాలు చాలా ప్రీతికరమని, గతంలో పట్టణంలో ఇలాంటి కార్యక్రమాలు ఉండేవి కావని, గత 4 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం దాతల సహకారంతో వైభవంగా కార్యక్రమం చేపట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం ఉత్సవ కమిటి సభ్యులు, సేవా కమిటి సభ్యులను వారు అభినందించారు. ఈ సంవత్సరం ఫోటోలు మరియు వీడియో మరియు లైవ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు వాసు స్టూడియో యజమాని మదళ్లపల్లె వాసు, హర్ష కుటుంబ సభ్యులను సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో బద్వేలు పట్టణ పరిసర ప్రాంత ఆర్యవైశ్యులందరూ పాల్గొన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన శివసాయి ఈవెంట్స్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సేవాకమిటి సభ్యులు పైడిమర్రి సుదర్శన్, చిందుకూరి శివ, మదళ్లపల్లె రాజేష్, సుబ్బరాజా, హరీష్, బంగారు సురేష్‌బాబు, సుమన్, నాగార్జున, పెసల సుధాకర్, యాదాళ్ల పవన్, చిందుకూరి వెంకటరమణ, కొనిజేటి చంద్రశేఖర్, పలువురు పాల్గొన్నారు.

**బోజనాలు ఏర్పాటు :**
ఆర్యవైశ్య కార్తక చతుర్థ వనభోజనాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మంగళగిరికి చెందిన ఆంధ్రప్రభ బ్రాంచ్ మేనేజర్ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు దేవతి భగన్నారాయణ, సతీమణి పద్మజ, కుమారులు దేవతి రంజిత్‌కుమార్, సతీమణి లక్ష్మి జ్యోత్స్న, నటుకుల శ్రీరామ్, సతీమణి సాయి హేమాంజలి కుటుంబ సభ్యుల సహకారంతో పలువురికి రుచికరమైన అల్పాహార విందును ఏర్పాటు చేయడం పట్ల ఆర్గనైజింగ్ సభ్యులు, బద్వేలు పట్టణ ఆర్యవైశ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





## డిజిటల్ అరెస్ట్ పై అవగాహన కలిగి ఉండాలి

**వేంపల్లె :నవంబర్ 16:(ప్రభాత వార్త)**
డిజిటల్ అరెస్ట్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వేంపల్లె సీఐ టి.నరసింహులు అన్నారు. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలు, పులివెందుల డిఎస్పీ మురళి నాయక్ సూచనల మేరకు డిజిటల్ అరెస్ట్ పై సంబంధిత ప్రచార బోర్డు లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటి పట్ల అవగాహన పెంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిజిటల్ అరెస్ట్ అనేవి చట్టంలో లేదని, విడియో కాల్స్ రిక్వెస్ట్ ద్వారా ఎప్పుడూ డబ్బు పంపవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్లు సిబిఐ, ఎన్.ఐ.ఏ, ఈడీ, పోలీస్ పేర్లతో భయపెట్టేందుకు ప్రయత్నిస్తారని, వీటిపై భయపడాల్సిన అవసరం లేదన్నారు. అలాంటి వీడియో కాల్స్ కు స్పందించొద్దని, తక్షణమే పోలిసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్ట్ లపై తమ పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.




## ఇన్ సర్వీస్ టీచర్స్‌కు టెట్‌ను రద్దు చేయండి



**మైదుకూరు, నవంబర్ 16, ప్రభాతవార్త:**
ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు(టెట్)ను రద్దు చేయాలని కోరుతూ మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్‌ని ఎస్‌టియు కడప జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పాలకొండయ్య, మైదుకూరు ప్రాంతీయ నాయకులు ఆయన స్వగృహంలో కలిసి మెమొరాండం సమర్పించడం జరిగినది. టెట్ అనేది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అసంబద్ధమైన చర్యగా తెలిపినారు. 25 మరియు 30 సంవత్సరాల వయస్సు గల సీనియర్ ఉపాధ్యాయులను టెట్ రాయమనడం ఎంతవరకు సమంజసమని తెలిపినారు. 50 సంవత్సరాల వయస్సు నిండిన ఉపాధ్యాయులను వారు బోధించే సబ్జెక్టు కాకుండా ఇతర సబ్జెక్టుల సిలబస్‌తో కూడిన టెట్ పరీక్ష రాయమనడం తలకు మించిన భారంలా తయారైందని ఆయన తెలిపినారు. జాతీయ స్థాయిలో ఉపాధ్యాయుల హక్కులు కాపాడే ఉపాధ్యాయ ఐక్య సంఘాలు ఇన్ సర్వీస్ టీచర్స్ తరపున సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేశాయని,అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేసేలా కృషి చేయాలని కోరారు. విద్యా హక్కుచట్టం 2009 ని సవరించి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వారు కోరారు.ఇప్పుడు జరుగుతున్న మొదటి సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు విద్యార్థులకు తలకు మించిన భారంలా తయారైందని , 8 నుండి 14 పేజీలు గల ప్రశ్నాపత్రాలు ఇవ్వడం దారుణమని తెలిపినారు. సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులతో ప్రశ్నా పత్రాలు తయారు చేయించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు వెంకటసుబ్బయ్య, రామ్మోహన్, చంద్రశేఖర్, రమణయ్య, కిరణ్ కుమార్, ఈశ్వరయ్య, విజయుడు, నారాయణ ప్రసాద్, నాగరాజ కుమార్, విజయ నరసింహ రాజు, సుబ్బారాయుడు, రామతీర్థ ప్రసాద్, రవీంద్ర బాబు, భాస్కర్,చాపాడు మండల నాయకులు సుబ్బారాయుడు,నందగోపాల్, కృష్ణయ్య, దువ్వూరు మండల నాయకులు ఈశ్వరయ్య, భాష,శంకర ఓబులరెడ్డి ,ఖాజీపేట ఓబన్న, రాజుపాలెం వీరబాబు మరియు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

### కేంద్రమాజీ మంత్రి చింతామోహన్



విలేకర్లతో మాట్లాడుతున్న చింతామోహన్

**మదనపల్లె, నవంబర్ 16 ప్రభాతవార్త :**
కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమంటూ కేంద్రమాజీ మంత్రి చింతామోహన్ తెలిపారు. ఆదివారం మదనపల్లెలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శనం నిర్వహించిన మహాసభకు కేంద్ర మాజీ మంత్రి ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు మదనపల్లెకు ఏం చేశారని ప్రశ్నించారు. మదనపల్లెకు మంజూరైన మెడికల్ కళాశాలను కూడా మూసివేశారన్నారు. ఎస్‌సి ఫైనాన్స్ కార్పోరేషన్‌లను వెంటనే ప్రారంభించాలన్నారు. ఎస్‌సిల పరిస్థితి గ్రామాల్లో చాలా దారుణంగా ఉందన్నారు. రూ.18లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పుకొంటూ ముఖ్యమంత్రి కాలక్షేపం చేస్తున్నారని ఎస్‌సి కాలనీల్లో ఉన్న బడులను మూసివేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు శ్రీసిటిలో 300పరిశ్రమలు తెచ్చామని, లక్షమందికి ఉద్యోగాలు ఇచ్చామని, రూ.60వేల కోట్లు ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. మదనపల్లె కిడ్నీ ముఠాదొంగలందరిని అరెస్టు చేసి జైలులో పెట్టాలన్నారు. కిడ్నీ రాకెట్ ముఠాలో కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు కూడా ఉన్నారన్నారు. కిడ్నీ రాకెట్‌పై ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. కిడ్నీలు అమ్ముతుండడం దుర్మార్గం, అన్యాయమన్నారు. సుందర్ పిచ్చయ్య అనే అతను పేదవాడు కాదని కోటీశ్వరుడు అన్నారు. ఆయనకు ప్రభుత్వం రూ.22వేల కోట్లు సబ్సిడీ ఇచ్చిందన్నారు. ఎస్‌సి,ఎస్‌టి, ఓబిసి మైనార్టీల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యార్థులకు ఫుల్‌మెస్ చార్జీలు ఇచ్చారని ప్రస్తుతం ప్రభుత్వం వాటిని ఆపివేసిందన్నారు. దేశవ్యాప్తంగా దళిత బహుజనులపై నిత్యం హత్యాచారాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టాలన్నారు. ఎస్‌సి వర్గీకరణపై మాల ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో మాట్లాడుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి చెన్నకేశవులు, అశోక్‌బాబు,స్వర్ణ వెంకటయ్య, పూతలపట్టు ప్రభాకర్, గుండా మనోహర్, గంగయ్య, ఈశ్వరయ్య, శేఖర్ తదితరలు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయత్ సంక్షేమానికి కృషి



**కలికిరి, నవంబరు 16, ప్రభాతవార్త:**
అనంతపురం జిల్లాలోని వీరశైవ లింగాయత్‌ల సంక్షేమానికి జంగం కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తామని రాష్ట్ర జంగం కులం సంక్షేమ సంఘం మరియు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వాసనూరి చంద్రశేఖర్ రాష్ట్ర వీర శైవలింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ స్వప్నలు తెలిపారు. ఆదివారం అనంతపురం జిల్లా జంగం సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వీరశైవ లింగాయత్‌ల స్థితిగతులను వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆరా తీశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ హాజరై వీర సంఘ లింగాయత్‌లకు, జంగం సభ్యుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఛైర్మన్ చంద్రశేఖర్, స్వప్నలకు వారు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. దీంతో కార్యక్రమం విజయవంతమైంది.

## వెంకటేశ్వర శతకం పుస్తకావిష్కరణ

**జమ్మలమడుగు, నవంబరు 16, ప్రభాతవార్త:**
గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 3వ రోజు అయిన ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు గొరిగె 'వెంకటేశ్వర శతకం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. గ్రంథాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మిరియాల శివగణపతి అధ్యక్షతన లోక జగన్నాథ శాస్త్రి మరియు జింక సుబ్రమణ్యంలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పుస్తకాన్ని డా.ఎం.ఎల్.నారాయణ రెడ్డి, జింకా సుబ్రమణ్యం మరియు లోక జగన్నాథశాస్త్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోక జగన్నాథశాస్త్రి పుస్తక సమీక్ష చేశారు. అక్క చెల్లెళ్ళు అయిన చంపకమాల, ఉత్పలమాల చందస్సులో శతకం రాయడం కవి యొక్క కావ్య అర్హతను నిర్ణయిస్తుందన్నారు. ఈ శతకాన్ని గుండ్లకుంట వాసి అయిన గొరిగె వెంకటేశ్వర్లు రచించారు. ఆయన 1989 నుంచి తన వాణిని ఆకాశవాణిలో వినిపిస్తున్నారు. సభాధ్యక్షులు మిరియాల శివగణపతి మాట్లాడుతూ గొరిగె వెంకటేశ్వర్లు నుంచి ఇలాంటి మరెన్నో రచనలు రావాలని ఆశించారు. ఈ కార్యక్రమం అనంతరం కవి గొరిగె వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. తన పుస్తకాన్ని ఆవిష్కరించినందుకు సహకరించిన లైబ్రేరియన్ నాదెండ్ల బాబ్జీకి, గ్రంథాలయ అభివృద్ధికమిటీకి, మరియు గడియారం సాహితీ పీఠానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుమార్, గొంటుముక్కల గోవిందు, తిప్పా బత్తిని నరసింహులు, అమీర్, కామనూరు రామ్మోహన్, పల్లా కృష్ణ, దర్పణం శ్రీనివాస్, దండే సురేష్, కొత్తపల్లె శీను తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, తెలుగు పండితులు, పుస్తక ప్రియులు విశేషంగా హాజరయ్యారు.